Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

RAJADHANI VARTALU




అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue): 295 పేజీలు (Pages): 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

గురువారం, 9 - 7 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

# రూ.100 కోట్లతో హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్ల మరమ్మత్తులు

**- బడుగుల జీవనోపాధికి కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాల నిధులకు పీ4 అనుసంధానం - సంక్షేమ శాఖలపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు**





**అమరావతి, (రాజధాని వార్తలు):** బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. ప్రభుత్వ వసతి గృహాలు, గురుకులాల్లో చదువుతోన్న విద్యార్థులకు చెల్లించే డైట్ ఛార్జీలను 10 శాతం పెంచాలని నిర్ణయించింది. ప్రస్తుతం ఇస్తున్న డైట్ ఛార్జీల్లో 10 శాతం పెంచాలని ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో సంక్షేమ శాఖలపై ముఖ్యమంత్రి సమీక్షించారు. ఈ సమీక్ష సందర్భంగా విద్యార్థులకు డైట్ ఛార్జీలు పెంచాలని సీఎం అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని.. వచ్చే ఏడాది నుంచి పెంచుదామని ఆర్థిక శాఖ అధికారులు సూచించినా... ఈ ఏడాది రెండో త్రైమాసికం నుంచే డైట్ ఛార్జీల పెంపు వర్తింపజేయాలని సీఎం స్పష్టం చేశారు. బలహీనవర్గాల విద్యార్థుల కోసం డైట్ ఛార్జీలు పెంచాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ...'బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల జీవితాల్లో విద్య ద్వారానే మార్పు వస్తుంది. దీనికి తగినట్టుగానే వారికి అన్ని రకాల అవకాశాలు కల్పించాలి. మెరుగైన విద్య, మౌళిక సదుపాయాలతో పాటు పౌష్టికాహారాన్ని అందించాల్సిన అవసరం ఉంది. ఈ మేరకే డైట్ ఛార్జీలు పెంచుతున్నాం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు లబ్ది చేకూర్చే విషయంలో వారికి కలిగే ప్రయోజనాన్ని పరిగణనలోకి తీసుకోవాలి' అని సీఎం చంద్రబాబు అన్నారు.

**పథకాల లబ్ది పేదలకు అందాలి**

"పేదలు, బలహీన వర్గాలకు సంక్షేమం అందించడమే కాదు... వారి జీవనోపాధిని మెరుగు పరిచి...మరింత ఆదాయాలు సమకూర్చేందుకు అన్ని మార్గాలను అన్వేషించాలి. ప్రభుత్వం వైపు నుంచి అందించే సంక్షేమం, మెప్మా, డ్వాక్రా పథకాల ద్వారా ఉపాధి కల్పించడంతోపాటు... పీ4 ద్వారా సాయం అందాలి. వ్యవసాయం, ఉద్యానరంగం, పాడి పరిశ్రమ, జీ రామ్ జీ సహా వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు మేలు చేకూర్చాలి. సాస్కీ, పూర్వోదయ, జీ రామ్ జీ వంటి పథకాల లబ్ది బడుగు వర్గాలకు దక్కేలా చూడాలి. ఉద్యాన, రబ్బర్, కాఫీ, పసుపు వంటి పంటల సాగును ప్రోత్సహించి ఆ వర్గాల రైతులకు లబ్ధి కలిగేలా చూడాలి. ఇప్పటికే కొన్ని విధానాల ద్వారా వారి జీవన స్థితిగతులను మెరుగు పరిచేలా పాలసీలు తీసుకున్నాం. లిక్కర్ షాపుల్లో కల్లుగీత వృత్తిదారులకు, క్వారీల్లో వడ్డెర్లకు కోటా పెట్టాం. నాయీ బ్రహ్మణులు, మత్స్యకారులు, చేనేత కార్మికులకు ఇలా వివిధ వర్గాలకు ఆర్ధికంగా సాయం చేస్తున్నాం. ప్రభుత్వ పరంగా అందించే సాయమే కాకుండా...వారి అభివృద్ధికి ఏమేం చర్యలు తీసుకోవానే అంశంపై ప్రతిపాదనలు సిద్దం చేయండి. ఈ మేరకు వివిధ కుల కార్పొరేషన్ల బైలాస్ మార్చే అంశాన్ని పరిశీలించండి. బ్రాహ్మణ కార్పొరేషన్ విధానాలను మిగిలిన కార్పొరేషన్లు కూడా అవలంభించేలా చర్యలు తీసుకోవాలి. జీ రామ్ జీ ద్వారా అంగన్వాడీ భవనాలను నిర్మించేలా చర్యలు తీసుకోవాలి. ఆర్వో ప్లాంట్ల ఏర్పాటు పూర్తి చేశామని... ఈ నెలాఖరు నాటికి టాయిలెట్ల నిర్మాణం పూర్తి చేస్తామని సీఎంకు అధికారులు వివరించారు. సమీక్షలో మంత్రులు డీబీవీ స్వామి, సవిత, సంధ్యారాణి, ఎన్ఎండీ ఫరూక్, మైనార్టీ సంక్షేమ సలహాదారు మహ్మద్ షరీఫ్ సహా వివిధ సంక్షేమ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# మత విద్వేషాలపై రాజద్రోహం కేసులు పెట్టాలి : మంత్రి ఆనం

**- రావన్ జోసెఫ్ వ్యాఖ్యలపై జగన్ రెడ్డి స్టాండ్ ఏంటి? : మంత్రి ఆనం - కూటమి రెండేళ్ల పాలనలో రూ 1,503 కోట్లకు చేరిన ఆలయాల ఆదాయం..124 కోట్ల నికర డిజిటల్ వృద్ధి : మంత్రి ఆనం**
**- 1.5 ఏళ్లలోనే దేవాదాయ శాఖలో ఖాళీలన్నీ భర్తీ చేశాం : మంత్రి ఆనం - 87 కోట్లతో గోదావరి పుష్కరాల పనులు ప్రారంభం : మంత్రి ఆనం - మరో 111 ఆలయాల్లో అత్యాధునిక 'సెంట్రలైజ్డ్ కిచెన్' అన్నప్రసాద విస్తరణ : మంత్రి ఆనం - "బెజవాడ దుర్గమ్మ వెండి సింహాలు మాయం చేసింది మీరే అని ఒప్పుకోండి"..గత వైకాపా మంత్రికి ఓపెన్ ఛాలెంజ్ విసిరిన ఆనం**

**అమరావతి, (రాజధాని వార్తలు):** భారత రాజ్యాంగం కల్పించిన భావప్రకటన స్వేచ్ఛను అడ్డం పెట్టుకుని సనాతన ధర్మాన్ని, హిందూ ఇతిహాసాలను కించపరుస్తూ మత విద్వేషాలు రేపేవారిని వారికి మద్దతిస్తున్న వైకాపా నాయకత్వాన్ని ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోదని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అత్యంత తీవ్రస్థాయిలో హెచ్చరించారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దేవాదాయ శాఖ అడ్వైజర్, కమిషనర్‌లతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ: ప్రతిపక్ష నేత జగన్ మోహన్ రెడ్డి వైఖరిపై, వారి అనుకూల మీడియా దుష్ప్రచారాలపై గత ఐదేళ్ల వైకాపా హయాంలో జరిగిన ఆలయాల విధ్వంసాలపై మంత్రి ఆనం నిప్పులు చెరిగారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఏ) ప్రకారం ప్రతి పౌరుడికి మాట్లాడే, భావ ప్రకటన చేసే హక్కు ఉన్నప్పటికీ.. అది అపరిమితమైనది కాదని, ఆర్టికల్ 19(2) ప్రకారం దేశ సార్వభౌమాధికారానికి, సామాజిక శాంతికి, మత సామరస్యానికి భంగం కలిగించరాదనే కఠినమైన పరిమితులు ఉన్నాయని మంత్రి గుర్తు చేశారు. అలాగే ఆర్టికల్ 25 ప్రతి ఒక్కరికీ నచ్చిన మతాన్ని ఆచరించే స్వేచ్ఛను ఇచ్చిందే తప్ప, ఇతరుల మతాలను దూషించే లైసెన్స్ ఇవ్వలేదని స్పష్టం చేశారు. "రావన్ జోసెఫ్ అనే వ్యక్తి హిందూ ఇతిహాసాలైన రామాయణ, మహాభారతాలను, సనాతన ధర్మాన్ని చిన్నచూపు చూస్తూ.. సీతారాములను, ద్రౌపదిని, హిందూ పీఠాధిపతులను, పూజారులను కించపరుస్తూ మాట్లాడుతుంటే జగన్ రెడ్డి, ఆయన 11 మంది ఎమ్మెల్యేలు ఎందుకు మద్దతు ఇస్తున్నారు? గతంలో మీ ఐదేళ్ల పాలనలో చిన్న సోషల్ మీడియా పోస్టులకే దేశద్రోహం కేసులు పెట్టి జైల్లో పెట్టిన జగన్ రెడ్డి.. ఇప్పుడు ఇంత పెద్ద మత విధ్వంసాన్ని, విచ్ఛిన్నకర శక్తులను సమర్థిస్తున్నందుకు ఆయనపై కూడా ఉగ్రవాద నిరోధక చట్టం (ఉపా-1967) రాజద్రోహం కింద కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాల్సిన అవసరం ఉంది. చట్టం ముందు అందరూ సమానులే, ఈ విషయంలో ప్రభుత్వం ఇంచీ కూడా వెనక్కి తగ్గదు" అని మంత్రి డిమాండ్ చేశారు.

**రికార్డు స్థాయిలో ఆలయాల ఆదాయ వృద్ధి.. రూ 1,503 కోట్లకు చేరిక:**



భక్తుల నమ్మకాన్ని నిలబెడుతూ దేవాదాయ శాఖలో తీసుకు వచ్చిన విప్లవాత్మకమైన సంస్కరణలు, వంద శాతం ఆన్‌లైన్ విధానం (సేవలు, కానుకలు, ప్రసాదాలు) ప్రవేశపెట్టడం వల్లే ఆలయాల ఆదాయం భారీగా పెరిగిందని మంత్రి ఆనం స్పష్టం చేశారు. వైకాపా అనుకూల మీడియా మిడిమిడి జ్ఞానంతో రాస్తున్న అవాస్తవాలను గణాంకాలతో తిప్పికొట్టారు. ఆలయాలలో కానుకలు, సేవలను ఆన్‌లైన్ పరిధిలోకి తేవడం వల్ల ఆదాయం 26 నుండి 30 శాతం పెరిగింది. భక్తులు ఇచ్చే ప్రతి రూపాయి నేరుగా స్వామివారి ఖాతాకే చేరుతోంది. గత వైకాపా ప్రభుత్వ చివరి ఏడాది (2023-24) లో 22 ప్రధాన ఆలయాల ఆదాయం రూ 942 కోట్లు ఉంటే, కూటమి ప్రభుత్వ రెండేళ్ల పరిపాలనలో (2025-26 నాటికి) అది ఏకంగా రూ 1503 కోట్లకు పెరిగింది. కేవలం ఒకే సంవత్సరంలో రూ 1379 కోట్ల నుండి 1503 కోట్లకు అంటే ?124 కోట్ల నికర వృద్ధి నమోదైంది. భక్తుల సంఖ్య 6.34 కోట్ల నుండి ఏకంగా 8 కోట్ల 5 లక్షలకు చేరింది. భక్తులు పెరిగారు కానీ ఆదాయం తగ్గిందంటూ ప్రతిపక్ష మీడియాలో దుష్ప్రచారం చేయడం సిగ్గుచేటు.

**రాష్ట్రంలోని ప్రధాన ఆలయాల ప్రగతి నివేదిక :**

రాష్ట్రంలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రాలలో భక్తుల సౌకర్యాలను మెరుగుపరచడం పారదర్శకమైన విధానాలను ప్రవేశపెట్టడం వల్ల భక్తుల తాకిడితో పాటు ఆలయాల ఆదాయం కూడా రికార్డు స్థాయిలో వృద్ధి చెందింది. ఈ ప్రగతి నివేదికను పరిశీలిస్తే, విజయవాడ కనకదుర్గమ్మ ఆలయానికి గతంలో 93 లక్షల మంది భక్తులు రాగా, కూటమి ప్రభుత్వ హయాంలో ఆ సంఖ్య ఏకంగా 1 కోటి 19 లక్షల 34 వేల మందికి చేరి చారిత్రాత్మక పెరుగుదలను నమోదు చేసింది. అలాగే, అన్నవరం సత్యనారాయణ స్వామి ఆలయంలో మెరుగైన వసతులు కల్పించడం వల్ల గతంలో ఉన్న 45 లక్షల మంది భక్తుల తాకిడి, ప్రస్తుతం 58 లక్షల మందికి పెరిగింది. వీటితో పాటు కోనసీమ జిల్లాలోని ప్రసిద్ధ వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ ఆదాయం గతంలో రూ 23 కోట్లుగా ఉంటే, కూటమి ప్రభుత్వ ప్రత్యేక చొరవ పటిష్టమైన నిర్వహణ కారణంగా అది ఏకంగా రూ 56 కోట్లకు చేరి, 100 శాతంకి పైగా అద్భుతమైన ఆర్థిక వృద్ధిని సాధించింది. "గతంలో అసలు వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయం ఎక్కడ ఉందో కూడా తెలియని పరిస్థితి వైకాపాది. సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల ప్రత్యేక చొరవ వల్ల కేవలం ఒకే సంవత్సరంలో వాడపల్లి ఆలయ ఆదాయం రూ 23 కోట్ల నుండి రూ 56 కోట్లకు చేరింది" అని మంత్రి వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో దేవాదాయ శాఖలో ఖాళీలను భర్తీ చేసిన నాథుడే లేడని, వ్యవస్థలను పూర్తిగా భ్రష్టు పట్టించారని మంత్రి మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ ఒకటిన్నర సంవత్సర కాలంలోనే దేవాదాయ శాఖలో ఉన్న ఉద్యోగ ఖాళీలన్నింటినీ భర్తీ చేశామని మంత్రి ప్రకటించారు. భవిష్యత్తులో ఎప్పుడు ఖాళీలు ఏర్పడినా ఎప్పటికప్పుడు భర్తీ చేసేలా నిరంతర నియామక ప్రక్రియను ప్రవేశపెట్టామన్నారు. ఆలయాలలో పూజాధికైంకర్యాలు ప్రమాణాల ప్రకారం జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

**రూ 87 కోట్లతో పుష్కరాల పనులు.. 111 ఆలయాల్లో అన్నప్రసాద విస్తరణ :**

రాబోయే గోదావరి పుష్కరాల కోసం ఇప్పటి నుంచే పనులు యుద్ధప్రాతిపదికన ప్రారంభించామని మంత్రి వెల్లడించారు. మొత్తం రూ 87 కోట్ల రూపాయల వ్యయంతో 276 పనులకు ఇప్పటికే పరిపాలన అనుమతులు ఇచ్చామని, ఇందులో 42 పనులు ఇప్పటికే గ్రౌండ్ అయ్యాయని, మిగిలిన వాటికి టెండర్లు ఫైనలైజ్ అవుతున్నాయని స్పష్టం చేశారు. పుష్కరాల ప్రధాన ఘాట్లలో వాడపల్లిని కూడా చేర్చామన్నారు. తమ హయాంలో ఒకే సంవత్సరంలో ప్రధాన దేవాలయాల్లో దాదాపు 3 కోట్ల మంది భక్తులకు అన్నప్రసాద వితరణ విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. ముఖ్యమంత్రి ప్రత్యేక ఆదేశాల మేరకు రాబోయే రోజుల్లో మరో 111 ఆలయాలలో అన్నప్రసాద వితరణను కొత్తగా ప్రారంభించబోతున్నామని, ఇందుకోసం కేవలం నిధులే కాకుండా అత్యాధునిక 'సెంట్రలైజ్డ్ కిచెన్' (సమగ్ర వంటశాలలు) వ్యవస్థను, వడ్డించడానికి అవసరమైన సేవకులను సిద్ధం చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతం 70 శాతం ఆలయాల్లో వంద శాతం ఆన్‌లైన్ సిస్టమ్ పూర్తయింది. భక్తుల కోసం ప్రత్యేక హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేశాం. ప్రతి ప్రధాన ఆలయంలో సీసీటీవీలు, కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి ఆన్‌లైన్ భద్రతా విభాగాల ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. హుండీ లెక్కింపులు కూడా నిబంధనల ప్రకారం అధికారుల సమక్షంలోనే పారదర్శకంగా జరుగుతున్నాయి.

**గత దేవాదాయ శాఖ మంత్రికి ఓపెన్ ఛాలెంజ్ :**

"నాకు 73 ఏళ్ల వయస్సు, 44 ఏళ్ల రాజకీయ అనుభవం ఉంది. ఉండీలు, నిధులు నేనేదో ఎత్తుకెళ్లామంటూ వైకాపా అనుకూల మీడియాలో రాసే రాతలకు భయపడే ప్రసక్తే లేదు. నిన్ననే వైకాపాకు చెందిన మాజీ మంత్రి, ఒక మాజీ ఎమ్మెల్యే కలిసి మా కమిషనర్‌కు లేఖ ఇవ్వడానికి వెళ్లారు. లేఖలో రాసింది ఒకటి, బయట మీడియాకు చెప్పింది ఒకటి. మీకు ధైర్యముంటే బయటకు వచ్చి 'కనకదుర్గమ్మ ఆలయంలో వెండి సింహాలను మాయం చేసింది మేమే' అని చెప్పండి. అంతర్వేదిలో రథాలు తగలబెడితే మాట్లాడలేదు, రామతీర్థంలో శ్రీరామచంద్రమూర్తి శిరచ్ఛేదం జరిగితే చర్యలు తీసుకోలేదు. మీ హయాంలో జరిగిన పాపాలను కప్పిపుచ్చుకోవడానికే ఇవాళ మాపై బురదజల్లుతున్నారు.

గత వైకాపా దేవాదాయ శాఖ మంత్రికి సవాల్ విసురు తున్నా.. ధైర్యముంటే మా కమిషనర్ ఆఫీసులోనే కూర్చుని ఐదేళ్లలో ఎవరు ఏం చేశారో బహిరంగ చర్చకు రావాలి" అని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సవాల్ విసిరారు. సనాతన ధర్మ సందేశం "హిందూ సంస్కృతి అనేది 'వసుధైక కుటుంబకం', 'సర్వేజనా సుఖినోభవంతు' అంటూ ప్రపంచ శాంతిని, సహజీవ నాన్ని, ప్రేమను బోధించిందే తప్ప ద్వేషాన్ని కాదని.. మతం కంటే మనసు గొప్పదనే విషయాన్ని రాజకీయ శక్తులు గుర్తుంచుకోవాలి" అని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తన ప్రసంగాన్ని ముగించారు.

# తెలంగాణ విద్యారంగానికి జాతీయ స్థాయిలో గుర్తింపు.. పీజీఐ 2.0 ర్యాంకింగ్‌లో భారీ పురోగతి

**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** తెలంగాణ విద్యారంగంలో అమలు చేస్తున్న సంస్కరణలకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన పర్ ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ 2.0 ర్యాంకింగ్‌లో తెలంగాణ రాష్ట్రం గణనీయమైన పురోగతి సాధించింది. గతంలో 31వ స్థానంలో ఉన్న రాష్ట్రం ప్రస్తుతం 26వ స్థానానికి చేరుకుంది. అలాగే పిజిఐ స్కోరు 552.5 నుంచి 599.7కు పెరగడం రాష్ట్ర విద్యా వ్యవస్థలో నమోదైన మెరుగుదలకు నిదర్శనంగా నిలిచింది. దీంతో తెలంగాణ ఆకాంక్షి-1 విభాగం నుంచి ప్రచేష్ట-3 విభాగంలోకి చేరుకుంది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన విద్యా సంస్కరణల ఫలితంగా జనగాం, మంచిర్యాల జిల్లాలకు ఉత్తమ్-3 గుర్తింపు లభించింది. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి 10,006 మంది కొత్త ఉపాధ్యాయులను నియమించగా, 25,950 మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించింది. అదేవిధంగా 1.12 లక్షల మంది ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ అందించి బోధన నాణ్యతను మరింత మెరుగుపరిచింది. విద్యార్థుల నైపుణ్యా భివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన ప్రభుత్వం 120 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలను ఇంటర్ స్థాయికి అప్‌గ్రేడ్ చేసింది. మరో 93 కేజీబీవీలకు యంగ్ ఇండియా ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ ఎక్సలెన్స్ గుర్తింపు లభించింది. ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ ఫలి తాల్లో తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ, గణిత విభాగాల్లో విద్యార్థులు మెరుగైన ప్రతిభ కనబరిచారు. సాంకేతిక విద్యకు ప్రాధాన్యం ఇస్తూ 1,132 పాఠశాలల్లో ఐసిటి ల్యాబ్‌లు, 2,036 పాఠశాలల్లో ఇంట రాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్, 4,249 ప్రాథమిక పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్‌లు ఏర్పాటు చేశారు. అలాగే ఒకటో తరగతి నుంచి 9వ తరగతి వరకు కృత్రిమ మేధస్సు, డిజిటల్ లిటరసీ పాఠ్యాంశాలను ప్రవేశపెట్టారు.

ఉపాధ్యాయుల నైపుణ్యాభివృద్ధి కోసం ఫిన్లాండ్, జర్మనీ దేశాలకు అధ్యయన పర్యటనలు కూడా నిర్వహించారు. ఈ చర్యల ఫలితంగా పదోతరగతి ఉత్తీర్ణత శాతం 95.15కు చేరుకోగా, రాష్ట్ర వ్యాప్తంగా 5,731 ప్రభుత్వ పాఠశాలలు 100 శాతం ఫలితాలు నమోదు చేశాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో చేపట్టిన విద్యా సంస్కరణలకు జాతీయ స్థాయిలో ప్రశంసలు లభిస్తున్నాయని ప్రభుత్వం పేర్కొంది.

# వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయంలో తొలి అంతర్జాతీయ సదస్సు ఐసిఆర్ఏఎం - 26 ఘనంగా ప్రారంభం










**అమరావతి, (రాజధాని వార్తలు):** వీఐటీ–ఏపీ విశ్వవిద్యాలయంలో “ది ఫస్ట్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ రీసెంట్ ఇన్నోవేషన్స్ ఇన్ అడ్వాన్స్డ్ మెటీరియల్స్” మంగళవారం (జూలై 8) ఘనంగా ప్రారంభమైంది. వీఐటీ–ఏపీ స్కూల్ ఆఫ్ అడ్వాన్స్డ్ సైన్సెస్ ఆధ్వర్యంలో జూలై 8 నుండి 10 వరకు మూడు రోజులపాటు నిర్వహిస్తున్న ఈ అంతర్జాతీయ సదస్సుకు అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్, బోర్డ్ ఆఫ్ రీసెర్చ్ ఇన్ న్యూక్లియర్ సైన్సెస్, కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ సంస్థలు స్పాన్సర్లుగా వ్యవహరిస్తుండగా, థర్మో ఫిషర్ సైంటిఫిక్, బయోలాజిక్, జైస్, సిస్కో రీసెర్చ్ లాబొరేటరీస్, మెట్రోహమ్ ఆటోల్యాబ్, మాల్వెర్న్ పనాలిటికల్, సిన్సిల్ ఇంటర్నేషనల్, బయోజెన్యూయిక్స్, టోక్యో కెమికల్ ఇండస్ట్రీ, ఆదిత్య సైంటిఫిక్ సంస్థలు సహకారం అందిస్తున్నాయి. ఈ సదస్సులో భారతదేశంలోని ప్రముఖ విద్యా, పరిశోధనా సంస్థలతో పాటు పలు దేశాల నుంచి వచ్చిన 40 మందికి పైగా ప్రతినిధులు, 220 మందికి పైగా పరిశోధకులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొంటున్నారు. ప్లీనరీ ఉపన్యాసాలు, కీలకోపన్యాసాలు, ఆహ్వానిత ప్రసంగాలు, సాంకేతిక సమావేశాలు, మౌఖిక మరియు పోస్టర్ ప్రజెంటేషన్ల ద్వారా అడ్వాన్స్డ్ మెటీరియల్స్ రంగంలో తాజా ఆవిష్కరణలు, అభివృద్ధి చెందుతున్న ధోరణులపై చర్చలు జరగనున్నాయి. ప్రారంభ కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ అడ్వాన్స్డ్ సైన్సెస్ డీన్ డా॥ ఎస్. శ్రీనివాస్ స్వాగత ప్రసంగం చేశారు. అనంతరం అతిథులు సంప్రదాయ దీప ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. ఐసీఆర్ఏఎం–2026 కన్వీనర్ డా॥ఎస్.ప్రతీప్ కుమార్ సదస్సు లక్ష్యాలు, కార్యక్రమాలపై సమగ్ర అవలోకనం అందించారు. ఈ సందర్భంగా డీన్–అకడమిక్ రీసెర్చ్ డా॥ఎం.వెంకట రాజనీకాంత్, భారతీయ విజ్ఞాన సంస్థ, బెంగళూరుకు చెందిన ప్రొఫెసర్ ఎస్. సంపత్, జవహర్‌లాల్ నెహ్రూ సెంటర్ ఫర్ అడ్వాన్స్డ్ సైంటిఫిక్ రీసెర్చ్, బెంగళూరుకు చెందిన ప్రొఫెసర్ స్వపన్ కె. పతి, మెక్సికోలోని నేషనల్ ఆటోనమస్ యూనివర్సిటీ ఆఫ్ మెక్సికోకు చెందిన ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫిజికల్ సైన్సెస్ ప్రొఫెసర్ హ్యూగో ఓల్వెరా వర్గాస్, వీఐటీ–ఏపీ వైస్–చాన్సలర్ ప్రొఫెసర్ పి.అరుళ్ మొళివర్మన్ సభను ఉద్దేశించి ప్రసంగించారు. మెక్సికోలోని ICF-UNAM డైరెక్టర్ డాక్టర్ జువాన్ కార్లోస్ హిడాల్గో కుయెల్లార్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభోపన్యాసం చేశారు. ఆయన సదస్సు సావనీర్‌ను, ICRAM 26 అబ్స్ట్రాక్ట్ బుక్కు ఆవిష్కరించి, తొలి అంతర్జాతీయ సదస్సును అధికారికంగా ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం ముఖ్య అతిథి, విశిష్ట అతిథులను సత్కరించారు.

కార్యక్రమం ముగింపులో కెమిస్ట్రీ విభాగాధిపతి డా॥ ఇల్లా రామకాంత్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సదస్సు జూలై 10 వరకు కొనసాగనుండగా, అడ్వాన్స్డ్ మెటీరియల్స్ పరిశో ధనలో అంతర్జాతీయ శాస్త్రీయ సహకారాన్ని బలోపేతం చేయ డంతో పాటు వినూత్న ఆవిష్కరణలకు వేదికగా నిలవనుంది. ఈ కార్యక్రమంలో తైవాన్‌లోని చెంగ్–షియు యూనివర్సిటీకి చెందిన డాక్టర్ కొగులరాసు శక్తివేల్, మెక్సికోలోని ICF-UNAMకు చెందిన డా॥మోహన్ కుమార్ కేసర్లా తదితరులు కూడా పాల్గొన్నారు.

# ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలకు మరింత విస్తృత ప్రచారం

## - డిజిటల్ కమ్యూనికేషన్ బలోపేతంపై మంత్రి కొలుసు పార్థసారథి దిశానిర్దేశం






**అమరావతి, (రాజధాని వార్తలు):** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగంగా, ప్రభావవంతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు డిజిటల్ కమ్యూనికేషన్ వ్యవస్థను బలోపేతం చేయాలని రాష్ట్ర సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆంధ్రప్రదేశ్ డిజిటల్ కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. రాజధాని అమరావతి పరిధిలోని తాడేపల్లిలో గల ఏపీ డిజిటల్ కార్పొరేషన్ కార్యాలయాన్ని మంత్రి బుధవారం సందర్శించి సంస్థ కార్యకలాపాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గత రెండేళ్లలో ప్రభుత్వ సోషల్ మీడియా వేదికల ద్వారా సుమారు మిలియన్ల వ్యూయర్ టచ్‌పాయింట్లు నమోదైనట్లు సమావేశంలో వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు మరింత సమర్థవంతంగా ప్రజల్లోకి చేరేలా డిజిటల్ ప్రచారాన్ని విస్తరించాలని మంత్రి సూచించారు.

**సమావేశంలో ప్రధానంగా చర్చించిన అంశాలు**

ప్రభుత్వంలోని అన్ని శాఖలు తమ కార్యక్రమాలకు సంబంధించిన ధృవీకరించబడిన సమాచారాన్ని సకాలంలో ఏపీ డిజిటల్ కార్పొరేషన్‌తో పంచుకోవాలని మంత్రి సూచించారు. దీనివల్ల ప్రభుత్వ సమాచారాన్ని వేగంగా ప్రజలకు చేరవేయడం సాధ్యమవుతుందని తెలిపారు.

ప్రభుత్వ సందేశాల విస్తరణ కోసం డిజిటల్ ఇన్‌ఫ్లుయెన్సర్లను ప్రభుత్వ కమ్యూనికేషన్‌లో భాగస్వాములను చేసేవవ విధంగా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఏపీడీసీని ఆదేశించారు. ప్రజలకు విశ్వసనీయమైన సమాచారం అందించేందుకు పోలీసు శాఖ ధృవీకరించిన సమాచారాన్ని ఏపీడీసీతో సమన్వయం చేసుకునే ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల డిజిటల్ చేరువను పెంచేందుకు వ్యూహాత్మక సోషల్ మీడియా ప్రచారాలకు ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి తెలిపారు. ప్రభుత్వ సోషల్ మీడియా వేదికల కోసం నాణ్యమైన డిజిటల్ కంటెంట్ రూపొందించేందుకు ప్రత్యేక కంటెంట్ క్రియేటర్లను నియమించాల్సిన అవసరాన్ని మంత్రి ప్రస్తావించారు. ప్రజల్లో అధిక ఆదరణ పొందుతున్న రీల్స్ మరియు షార్ట్–ఫామ్ వీడియో కంటెంట్ ప్రభుత్వ డిజిటల్ కమ్యూనికేషన్‌లో కీలక భాగంగా ఉండేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజాహిత నిర్ణయాలను, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, ఫేస్‌బుక్ తదితర డిజిటల్ వేదికల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సోషల్‌వ మీడియా యూనిట్లను పూర్తిస్థాయిలో క్రియాశీలం చేసి, ప్రభుత్వ కార్యక్రమాలను గ్రామస్థాయి వరకు సమర్థవంతంగా ప్రజలకు చేరవేయాలని సూచించారు. సమావేశంలో మంత్రి పార్థసారథి సంస్థ ఉద్యోగుల సమస్యలను కూడా అడిగి తెలుసుకుని, సంస్థ కార్యకలాపాల నిర్వహణకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ డిజిటల్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా. రాణి సుష్మిత, ఐ & పీఆర్ – స్పెషల్ ఆఫీసర్ గల్లా శేషుకుమార్, ఇతర అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# మునిసిపల్ శాఖలో ఆధునీకరించిన కమాండ్ కమ్యూనికేషన్ సెంటర్‌ను ప్రారంభించిన మంత్రి నారాయణ





**అమరావతి, (రాజధాని వార్తలు):** ఇప్పటివరకూ సచివాలయంలో ఉన్న సిసిసిను రాయపూడిలోని మునిసిపల్ శాఖ ప్రధాన కార్యాలయంలోకి మార్పు. హాజరైన మునిసిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్, డైరెక్టర్ సంపత్ కుమార్.

మంత్రి నారాయణ కామెంట్స్...

ఏఐ టెక్నాలజీతో అత్యాధునిక కమాండ్ కమ్యూనికేషన్ సెంటర్ ఏర్పాటు చేశాం. 123 మున్సిపాలిటీల సేవలను ఒకే కేంద్రం నుంచి పర్యవేక్షిస్తాం. ప్రతి వార్డు, ప్రతి వీధిలో ఏం జరుగుతుందో రియల్ టైమ్‌లో మానిటరింగ్ చేస్తాం. సాలిడ్ వేస్ట్, లిక్విడ్ వేస్ట్ నిర్వహణపై ప్రత్యేక నిఘా ఉంటుంది. తాగునీటి నాణ్యత, గుంతలు లేని రోడ్లు, వీధి దీపాల నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ. పురమిత్ర, రియల్ టైమ్ గవర్నెన్స్ ద్వారా వచ్చే ప్రతి ఫిర్యాదును ట్రాక్ చేస్తాం. పరిష్కారం కాని సమస్యలపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటారు. 2014–19లో ప్రారంభించిన వ్యవస్థను మరింత ఆధునికంగా తీర్చిదిద్దాం. గత ప్రభుత్వం ఈ వ్యవస్థను పక్కన పెట్టింది. ప్రజలకు వేగవంతమైన, నాణ్యమైన మున్సిపల్ సేవలందించడమే ఈ కమాండ్ కమ్యూనికేషన్ సెంటర్ లక్ష్యం.

# కొండపల్లి మున్సిపాలిటీలో వక్ఫ్ అక్రమాలపై అధికారులకు వక్ఫ్ బోర్డు నోటీసులు

## - కొండపల్లి మున్సిపల్ కమిషనర్, రెవెన్యూ శాఖకు వక్ఫ్ బోర్డ్ నోటీసులు




**ఇబ్రహీంపట్నం, (రాజధాని వార్తలు):** కొండపల్లి పట్నంలోని వక్ఫ్ బోర్డు స్థలాలు, ఆక్రమణలు సంబంధిత అంశాలపై వివరణ కోరుతూ కొండపల్లి మున్సిపల్ కమిషనర్, ఇబ్రహీంపట్నం తాసిల్దార్, రెవిన్యూ శాఖకు ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్ బోర్డు నోటీసులు జారీ చేసింది. ఇందులో ముఖ్యంగా వక్ఫ్ ఆస్తులకు ఎన్ఓసీలు, నిర్మాణాలకు టౌన్ ప్లానింగ్, అక్రమంగా ఇంటి పన్నులు, వక్ఫ్ బోర్డు ఆస్తులలో వక్ఫ్ బోర్డు అనుమతి లేకుండా రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, విద్యుత్, మంచినీటి సరఫరా వంటి చేయడంపై ఆక్షేపణ తెలిపారు. హజ్రత్ ముర్తజా అలీ పంజా, సర్వే నం. 212/ఎలో 13.75 ఎకరాలు,సర్వే నం. 212/బిలో 4.55 ఎకరాలు (మొత్తం 18.30 ఎకరాలు) కలిగిన భూములు వక్ఫ్ ఆస్తులుగా గుర్తించబడి, 28.06.1962 నాటి ఆంధ్రప్రదేశ్ గెజిట్ నం. 26, పార్ట్–2లో వక్ఫ్ భూములుగా ప్రచురించబడ్డాయి. సర్వే నం. 289/3లో 3.75 ఎకరాల విస్తీర్ణం కలిగిన భూమి కూడా వక్ఫ్ ఆస్తిగా గుర్తించబడింది. అదేవిధంగా ఇబ్రహీంపట్నంలో ఖాజీ మాన్యం ‘ఖాజీ సర్వీస్ ఇనామ్ భూమి’ కూడా వక్ఫ్ ఆస్తిగా గుర్తించబడింది. అక్కడ కూడా మున్సిపల్ నిధులతో అభివృద్ధి చేయడంపై ఆక్షేపణ వ్యక్తం చేశారు. సర్వే నెంబర్ 293 /1 సర్వేనెంబర్ 401. సర్వే నంబర్ 438/1 భాష అలం పంజా వక్ఫ్ భూములుగా ఉన్నవి ఆయా అంశాలకు సంబంధించి వివరణ ఇవ్వాలని, లేనిచో వక్ఫ్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని నోటీస్‌లో తెలిపారు.

# రాజధాని రైతుల సమస్యలు పరిష్కారంపై ప్రభుత్వం ఫోకస్



**అమరావతి, (రాజధాని వార్తలు):** అమరావతి రైతు జేఏసీ ప్రతినిధులతో సమావేశమైన మంత్రి నారాయణ. సమావేశానికి హాజరైన సీఆర్డీఏ కమిషనర్ విజయరామరాజు,అదనపు కమిషనర్లు, 20 మందికి పైగా జేఏసి నాయకులు. రైతుల సమస్యలు, గ్రామాల్లోని సమస్యల పరిష్కారం అజెండాగా సమావేశంలో చర్చ. గ్రామ కంఠం సమస్యలు, ఎఫ్ఎస్ఐ పెంపు, ప్లాట్‌ల రిజిస్ట్రేషన్లు, గ్రామాల్లో చెత్త డంపింగ్, గ్రామాల్లో ట్రాఫిక్ సమస్యలు, గ్రామాల్లోకి రోడ్ల కనెక్టివిటీ అంశాలను సమావేశం ముందుంచిన రైతులు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై సంతృప్తి వ్యక్తం చేసిన రైతులు.

# ఎమ్మెల్యే సునీల్ కుమార్ దాతృత్వంతో క్రికెట్ కిట్ పంపిణీ

**గూడూరు, (రాజధాని వార్తలు):** విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించే విధంగా గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే రాష్ట్ర టిడిపి ప్రధాన కార్యదర్శి డాక్టర్ పాశిం సునీల్ కుమార్ నియోజకవర్గ వ్యాప్తంగా విద్యార్థులను అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తుంటాడు. ఈ క్రమంలో గూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎమ్మెల్యే సునీల్ కుమార్‌ను క్రికెట్ కిట్టు అవసరమని అడిగిన వెంటనే 15 వేల రూపాయల విలువచేసే క్రికెట్ కిట్‌ను ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులకు క్యాంప్ కార్యాలయం నందు పట్టణం అధ్యక్షులు పులిమి శ్రీనివాసరావు, క్లస్టర్ ఇంచార్జ్ వేముల సునీల్ చేతుల మీదుగా వారికి అందించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ గూడూరు



నియోజకవర్గంలో అభివృద్ధి సంక్షేమం లక్ష్యంగా ఎమ్మెల్యే సునీల్ కుమార్ కృషి చేస్తున్నారని అదే అదే కోవలో పాఠశాలల అభివృద్ధి మౌలిక సౌకర్యాలు కల్పనతో పాటు విద్యార్థులకు క్రీడా పరికరాలు అందించడం అభినందనీయమన్నారు.

# వర్షాకాలం పొంచి ఉన్నందున గెడ్డలు, కాలువలు పొంగకుండా చర్యలు చేపట్టాలి

## - జీవీపీల నిర్మూలన, పారిశుధ్య నిర్వహణ, వీధి కుక్కల నియంత్రణపై ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలి : జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** రానున్న వర్షాకా లాన్ని దృష్టిలో ఉంచుకుని నగరంలో గెడ్డలు, కాలువలు పొంగి పొరలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ జీవీఎంసీ ప్రజా ఆరోగ్యపు అధికారులను ఆదేశించారు. మంగళ వారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా ఆరోగ్య విభాగ సమీక్ష సమావే శంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ పి. నల్లనయ్య, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈ.ఎన్.వి.నరేష్ కుమార్, సహాయ వైద్యాధికా రులు, శానిటరీ సూపర్వైజర్లు, శానిటరీ ఇన్స్పెక్టర్లు తది తర అధికారులు పాల్గొనగా జోనల్ కమిషనర్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ఇంజినీరింగ్ మరియు ప్రజా ఆరోగ్య విభాగాలు సంయుక్తంగా కార్యాచరణ రూపొందించి కాలువలు, గెడ్డల్లో వర్షపు నీరు పొంగకుండా ప్రణాళిక బద్ధంగా ముందస్తు చర్యలు చేపట్టాలని, గెడ్డలు, కాలువలలో ఆధునీకరణ పనులు చేపడుతు న్నట్లయితే మురుగు, వర్షపు నీరు ఎటువంటి ఆటంకం లేకుండా సాఫీగా పోయే విధంగా ఇంజనీరింగ్ అధికారులు చర్యలు తీసు కోవాలన్నారు. నగరాన్ని పూర్తిస్థాయిలో గార్బేజ్ వల్నరబుల్ పాయింట్స్ రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించా లని కమిషనర్ ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న జీవీపీలను శాశ్వ తంగా తొలగించి వాటిని గ్రీన్ స్పాట్లుగా అభివృద్ధి చేయాలని, ప్రతి కాలనీ, వీధి, ప్రధాన రహదారి పరిశుభ్రంగా ఉండేలా సహాయ వైద్యాధికారులు, శానిటరీ ఇన్స్పెక్టర్లు నిరంతరం పర్యవే క్షించాలని ఆదేశించారు. నివాస ప్రాంతాలు, వాణిజ్య సముదా యాలు, దుకాణాల వద్ద బహిరంగంగా చెత్త వేస్తున్న వారిపై నిర్భయంగా జరిమానాలు విధించాలని ఆదేశించారు. నగర పరిశుభ్రత విషయంలో నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. క్లాప్ వాహ నాల నిర్వహణను సమర్థవంతంగా నిర్వహించాలని, ఇంటింటి చెత్త సేకరణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదని హెచ్చరించారు. వ్యర్థాల సేకరణలో అలసత్వం వహిస్తే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వీధి కుక్కల సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ సూచించారు. ప్రజలకు ఇబ్బంది కలగ కుండా వీధి కుక్కలను నియంత్రించేందుకు జోన్ల వారీగా సమగ్ర సర్వే నిర్వహించి నివేదికను సమర్పించాలని జీవీఎంసీ సిటీ వెటర్నరీ అధికారి డాక్టర్ కిరణ్ కుమార్‌ను ఆదేశించారు. నగరం లో ప్రజా రవాణా ఆటోల నుంచి రోడ్లపై విరివిగా వ్యర్థాలు పడవేయడాన్ని గుర్తించామని, తద్వారా రోడ్లు అపరిశుభ్రతకు గురవుతున్నాయన్నారు. ఈ విషయమై ఆటో యూనియన్లతో సమావేశాలు నిర్వహించి ప్రతి ఆటోలో చిన్న డస్ట్‌బిన్ ఏర్పాటు చేసుకునేదా వారికి అవగాహనపరిచి తగిన చర్యలు తీసుకోవాలని సహాయ వైద్యాధికారులను ఆదేశించారు. పారిశుధ్య కార్మికులు నగర పరిశుభ్రతకు ఎంతో శ్రమిస్తున్నారని వారికి జీతాలు నిర్ణీత గడువులోపు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జీతాల చెల్లింపులో ఆలస్యం జరిగితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజారోగ్య విభాగం పనితీరు, పారిశుధ్య నిర్వహణ, గెడ్డలు, కాలువలలో పూడికల తొలగింపు, వీధి కుక్కల నియంత్రణ కు తగిన చర్యలు చేపట్టాలని అదనపు కమిషనర్ నల్లనయ్యకు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్‌లకు కమిషనర్ ఆదేశించారు ఈ కార్యక్రమంలో స్టాటిస్టికల్ అధికారి పి డి వి ప్రసాద్, బయాలజిస్ట్ సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో పలు ప్రాంతాలను పరిశీలించిన జీవీఎంసీ కమిషనర్

## - నేటివ్ అరకు కాఫీ - స్వయం ఏపీ మిల్లెట్ మిక్స్ ఉత్పత్తులు, ఓ ఎన్ డి సి విక్రయాలకు ప్రోత్సాహం - ప్రధాన కార్యాలయం సుందరీకరణకు ప్రణాళికలు సిద్ధం చేయండి : జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** జీవీఎంసీ ప్రధాన కార్యాలయాన్ని ఆధునిక సౌకర్యాలతో, ఆకర్షణీయంగా తీర్చిదిద్దేం దుకు అవసర మైన ప్రతిపాదనలను, జీవీఎంసీ సెల్లార్ ఫ్లోర్‌లో నేటివ్ అరకు కాఫీ, మిల్లెట్ మిక్స్ అవుట్లెట్లు, ఓఎన్డిసి విక్రయాలకు తగిన ఏర్పాట్లను సిద్ధం చేయాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళ వారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని పలు ప్రాంతా లను జీవీఎంసీ అదనపు కమిషనర్ పి.సత్యవేణి, ప్రధాన ఇంజనీరు సత్యనారా యణ రాజు, డిడిహెచ్ వాసుకిలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యాలయం సెల్లార్‌లో ఉన్న పాత క్యాంటీ న్‌ను సందర్శించి అందులో నేటివ్ అరకు కాఫీ, త్వరలో ప్రారం భం కాబోతున్న స్వయం ఏపీ బ్రాండ్ మిల్లెట్ మిక్స్ ఉత్పత్తుల ఔట్లెట్లు ఏర్పాటు చేసేందుకు, అలాగే సెల్లార్ ఫ్లోర్‌లో క్రేచ్ ప్రాంగణంలో మెప్మా ద్వారా స్వయం సహాయక సంఘ సభ్యులు తయారు చేస్తున్న హ్యాండ్ మేడ్ ఉత్పత్తులు ఆన్లైన్‌లో ఓ ఎన్ డి సి ఫ్లాట్ ఫామ్ ద్వారా విక్రయించేందుకు తగిన ఏర్పాట్లు సిద్ధం చేయాలని పీవీవి సత్యనారాయణ రాజును కమిషనర్ ఆదేశిం చారు. అనంతరం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరాన్ని పరిశీలించిన కమిషనర్, ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా పూర్తిస్థాయిలో ఆధునికీకరించాలని సూచించారు. కార్యాలయ ఆవరణ మరింత ఆకర్షణీయంగా రూపొందించాలని ప్రధాన ఇంజనీరుకు సూచించారు. ప్రధాన కార్యాలయం వెనుక భాగాన్ని సైతం సుందరంగా తీర్చిదిద్దాలని, పాత కౌన్సిల్ హాల్ పరిసరాలలో, కారిడార్లలో అలంకార మొక్కలు, కింది భాగంలో పచ్చదనాన్ని పెంచే మొక్కలను నాటా లని డిడిహెచ్ వాసుకిని ఆదేశించారు. కార్యాలయ ప్రాంగణాన్ని హరిత వాతావరణంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. ఈ పరిశీల నలో జీవీఎంసీ కార్యని ర్వాహక ఇంజనీరు గంగాధర్, ఉప కార్యనిర్వాహక ఇంజనీరు మౌళి, ఆఫీస్ ఇన్‌చార్జి సత్యనారాయణతో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పుస్తకాలు, కంచాలు పంపిణీ

## - పంపిణీ చేసిన అల్లు కుటుంబీకులు



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** మండలంలోని ములకల గుమడాం గ్రామానికి స్వర్గీయ అల్లు రామునాయుడు కుమారులు అల్లు రాజశేఖర్, అల్లు గిరి, ధనుంజయనాయుడు తమ సోదరి దివంగత అల్లు లక్ష్మీనారాయణమ్మ జ్ఞాపకార్థం మంగళవారం గ్రామంలోని గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థు లకు 12 వేల రూపాయల విలువ చేసే పుస్తకాలు, కంచాలు, గ్లాసులు, పెన్సిళ్లు, జామెట్రీ బాక్సులు, ఎరైజర్స్, షార్ప్నర్లు అంద జేశారు.

ప్రతి ఏట తమ సోదరి లక్ష్మీనారాయణమ్మ వర్ధంతి సం దర్భంగా తమ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశా లలో చదువుతున్న విద్యార్థులకు అల్లు కుటుంబ సభ్యులు ఈ విధంగా అందజేస్తూ వస్తున్నారు. అందులో భాగంగానే ఈ కార్యక్ర మం చేపట్టారు. అలాగే విద్యార్థులకు కేకు, మిక్చర్ కూడా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అల్లు పెంటమనాయుడు వారసులు, మనుమలు, కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# గంభీరం రిజర్వాయర్‌లో విషాదం : ఈతకు వెళ్లి తొమ్మిదో తరగతి విద్యార్థి మృతి



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ఆనందపురం మం డలంలోని గంభీరం రిజర్వాయర్‌లో ఈత కోసం వెళ్లి ఓ విద్యార్థి మృతి చెందిన ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రిజర్వాయర్‌లో ఓ బాలుడు మునిగిపోయినట్లు సమాచారం అందడంతో పోలీ సులు, ఈతగాళ్లు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో రిజర్వాయర్ పరిసరాల్లో 'సర్వేపల్లి రాధాకృష్ణ' పేరుతో ఉన్న పాఠశాల దుస్తులు లభించాయి. అనంతరం నీటిలో తీవ్రంగా గాలించగా, సుమారు 14 సంవత్స రాల వయస్సు గల బాలుడి మృతదేహం లభ్యమైంది. చంద్రం పాలెం హైస్కూల్ విద్యార్థిగా గుర్తింపు. పోలీసుల ప్రాథమిక దర్యా ప్తులో మృతి చెందిన బాలుడిని చంద్రంపాలెం హైస్కూల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న గవర వంశీ (14)గా గుర్తించారు. వంశీ మంగళవారం పాఠశాలకు వెళ్లలేదని పోలీసుల విచారణలో తేలింది. ఈత కోసం రిజర్వాయర్ వద్దకు వచ్చి ప్రమాదవశాత్తు లోతైన నీటిలో మునిగిపోయి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. ప్రస్తుతం బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఈ విద్యార్థి ఏ ఊరికి చెందినవాడు? ఇక్కడికి ఒంటరిగానే వచ్చాడా లేక స్నేహితులతో కలిసి వచ్చాడా? అసలు ప్రమాదం ఎలా జరిగింది? అనే పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఆనందపురం సిఐ సిహెచ్. వాసు నాయుడు ఆధ్వర్యంలో స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఘనంగా మంద కృష్ణ మాదిగ జన్మదినం - ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ వేడుకలు






**కరప, (రాజధాని వార్తలు):** కాకినాడ రూరల్ కరప మండలం గొడ్డటిపాలెం బాబు జగ్జీవన్‌రామ్ కాలనీలో మంగళవారం ఎమ్మా ర్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు, పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణ మాదిగ జన్మదినోత్సవంతో పాటు ఎమ్మార్పీఎస్ 32వ ఆవి ర్భావ దినోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. కరప మండల ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి పలివెల రమేష్‌బాబు ఆధ్వర్యంలో ముందుగా నూతన ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించి ఉద్యమ స్ఫూర్తిని చాటి చెప్పారు. ఈ సందర్భంగా నిర్వహిం చిన సభలో ముఖ్య అతిథులుగా కాకినాడ జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి పెంకె శ్రీనివాస్ బాబా, కరప మండల జనసేన పార్టీ అధ్యక్షుడు బండారు మురళి, గొడ్డటిపాలెం జనసేన పార్టీ అధ్యక్షుడు వీరంరెడ్డి ముత్యాలరావు, అరట్లకట్ట మాజీ సర్పంచ్ కంటే సత్తిబాబు, అరట్లకట్ట జనసేన పార్టీ అధ్య క్షుడు బత్తుల సతీష్, జనసేన సీనియర్ నాయకుడు, చోడబత్తుల మణికంఠ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ ఎస్సీ వర్గీకరణ ఉద్యమానికి జీవితాంతం అంకితభావంతో కృషి చేసి సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాడిన మహోన్నత నాయకుడని కొనియాడారు. ఎమ్మార్పీఎస్ చేపట్టిన ఉద్యమాల ఫలితంగా దళితుల హక్కుల పరిరక్షణ, సామాజిక సమానత్వం అంశాలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయని పేర్కొ న్నారు. ఉద్యమ లక్ష్యాలను ప్రతి కార్యకర్త గ్రామస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లి, సామాజిక న్యాయం సాధన కోసం ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మంద కృష్ణ మాదిగ జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి ఒకరికి ఒకరు శు భాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బెంజిమెన్ రాజు, పెంకె సత్యనారాయణ, గ్రామ పెద్దలు సింగిరెడ్డి చిన్నబాబు, బీసీ నాయకుడు పిల్లి రాంబాబు, ఎస్సీ పేట పెద్దలు పలివెల నాగబాబు, మాజీ వార్డు సభ్యుడు పలివెల రాజు, చాట్ల వెంకటేశ్వర్లు, కొత్తూరు అప్పారావు, పలివెల అర్జునరావు, గోడత సత్యనారాయణ, ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీ కాశీ వారాహి అమ్మవారి ఆలయానికి ఉత్సవ విగ్రహం విరాళం

## - రూ. 1 లక్ష విలువైన 20 కిలోల ఇత్తడితో ఉత్సవ విగ్రహం సమర్పించిన దాతలు



**కరప, (రాజధాని వార్తలు):** కాకినాడ రూరల్ కరప మండలం కురుపల్లి పరిధిలోని కాకినాడ - రామచంద్రపురం ప్రధాన రహదారిలో శ్రీ కాశీ వారాహి అమ్మవారి ఆలయానికి భక్తులు పలివెల వెంకట భాస్కరరాయులు, వీర రాఘవమ్మ దంప తులు విశిష్టమైన కానుకను సమర్పించారు. ఆలయంలో జరిగే ఈ నెల 15వ తేదీ నుండి గుప్త నవరాత్రుల సందర్భంగా ప్రత్యేక పూజలు, గ్రామోత్సవాల్లో వినియోగించే ఉత్సవ విగ్రహాన్ని సుమారు 20 కిలోల ఇత్తడితో ప్రత్యేకంగా తయారు చేయించి ఆలయానికి విరాళంగా అందజేశారు. ఈ ఉత్సవ విగ్రహం విలువ సుమారు రూ.1 లక్ష ఉంటుందని ఆలయ ధర్మకర్త చిక్కాల దొరబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త చిక్కాల దొరబాబు మాట్లాడుతూ అమ్మవారిపై అపారమైన భక్తి, విశ్వా సంతో దాతలు ఈ ఉత్సవ విగ్రహాన్ని సమర్పించడం ఎంతో ఆనందదాయకమని పేర్కొన్నారు. ఆలయ సంప్రదాయాలు, ఆగమ శాస్త్రాల ప్రకారం నిర్వహించే ఉత్సవాల్లో ఈ విగ్రహాన్ని వినియోగించనున్నట్లు తెలిపారు. దీంతో ఆలయ ఉత్సవాలకు మరింత వైభవం చేకూరుతుందని ఆయన అన్నారు. ఆలయ అభివృద్ధికి, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు భక్తులు స్వచ్ఛం దంగా అందిస్తున్న విరాళాలు ఎంతో ప్రోత్సాహకరమని, భక్తుల సహకారంతో ఆలయం మరింత అభివృద్ధి చెందుతోందని ధర్మకర్త తెలిపారు. అమ్మవారి సేవలో భాగంగా చేసిన ఈ దాతృత్వం ఇతర భక్తులకు కూడా స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని పేర్కొ న్నారు. ఉత్సవ విగ్రహాన్ని సమర్పించిన పలివెల వెంకట భాస్కర రాయులు, వీర రాఘవమ్మ దంపతులకు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేస్తూ, అమ్మవారి ఆశీస్సులు వారికి ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.

# సంపాదకీయం

## ఈ పరిణామాలు దేనికి సంకేతం?

'అయోధ్య రామమందిరంలోని హుండీల్లో ఉన్న డబ్బును తస్కరించడంపై ఆచితూచి మాట్లాడండి. ఈ అవినీతి వ్యవహారం మొత్తం హిందూ సమాజానికి మనస్తాపం కలిగించింది. కొంతమంది తప్పుడు వ్యక్తుల మూలంగా ఇది జరిగింది. నేరస్థులను ప్రభుత్వం వదిలిపెట్టదు' అని భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ అన్నారు. రెండు రోజుల క్రితం ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ కీలక నేతల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అయోధ్య ఘటనలు బీజేపీని ఎంతగా కుదిపివేశాయో నితిన్ నబీన్ వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి. నిజానికి బీజేపీ ఆఫీసు బేరర్లు, కార్యవర్గ సభ్యులను నియమించడంతో పాటు కేంద్ర ప్రభుత్వంలోనూ భారీ ఎత్తున మార్పులు చేసేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సన్నద్ధమవుతున్న తరుణంలో అయోధ్యలో దొంగతనాలు వెలుగులోకి వచ్చాయి. పార్లమెంటు వర్షాకాల సమావేశాలకు ముందే ఈ మార్పులకు శ్రీకారం చుట్టి పార్టీకి, ప్రభుత్వానికి కొత్త రూపురేఖలు తీర్చిదిద్దేందుకు మోదీ సన్నద్ధమయ్యారు. అనేక స్థాయిల్లో కీలక చర్చలు జరిపారు. కేబినెట్ మంత్రులు, సహాయ మంత్రులతో ఆయన వేర్వేరుగా, కలిసికట్టుగా గంటల తరబడి సమీక్షా సమావేశాలు నిర్వహించారు. మార్పులు తప్పవన్న సంకేతాలనిచ్చారు. కేంద్ర ఆర్థిక మంత్రి, విద్యామంత్రి, సహా పలువురు మంత్రులకు స్థానచలనం తప్పదని సంకేతాలు రావడంతో ఆయా శాఖల నిర్వహణ సవ్యంగా లేదన్న విషయం స్పష్టమవుతోంది. ప్రధానమంత్రి ఆమోద యోగ్యత శాతం పెరుగుతోందని ఎప్పుడూ సర్టిఫికెట్లు ఇచ్చే మార్నింగ్ కన్సల్టెన్సీ సంస్థ ఈసారి మోదీకి ప్రజాదరణ 75-78 శాతం నుంచి 68-70 శాతానికి పడిపోయిందని చెప్పడం గమనార్హం. కనుక ప్రధాన మంత్రి జాగ్రత్త పడాలనుకోవడంలో ఆశ్చర్యం లేదు. అయితే తలపెట్టిన మార్పులకు ఇది సరైన సమయం కాదనుకున్నారో, లేక అంతర్గతంగా ఏ సమస్యలు వచ్చాయో కానీ ప్రధానమంత్రి వాటిని వాయిదా వేసుకున్నట్లే కనిపిస్తోంది. తమపై వేటు తప్పదేమో అనుకున్న పలువురు మంత్రులు ప్రస్తుతానికి ఊపిరి పీల్చుకున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. అయోధ్య ఘటనే కాదు, అనేక అంశాలపై దేశంలో ఏదో ఒక వివాదం రేగుతూనే ఉన్నది. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ప్రకటించిన ఈక్విటీ నిబంధనలపై వివాదం రగులుతోంది. అత్యంత ప్రతిష్ఠాత్మకమైన మెడికల్ ఎంట్రన్స్ పరీక్ష నీట్- యూజీ నిర్వహణలో అక్రమాలు, వరుస పేపర్ లీకేజీలు తీవ్ర సంచలనం సృష్టించాయి. విద్యార్థుల నిరసనకు మద్దతుగా లద్దాఖ్‌కు చెందిన ప్రముఖ విద్యావేత్త, పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ గత ఎనిమిది రోజులుగా జంతర్ మంతర్ వద్ద నిరాహార దీక్ష నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ-20 ఇథనాల్ బ్లెండింగ్ విధానంపై తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఈ విధానం వల్ల ఆహార భద్రత దెబ్బతిన్నదని, విధానాల రూపకల్పనలో కొందరు మంత్రుల ప్రయోజనాలు దాగి ఉన్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అండమాన్, నికోబార్ దీవుల్లో రూ.90 వేలకోట్ల 'గ్రేట్ నికోబార్ మెగా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్ట్'పై కేంద్ర ప్రభుత్వం-పర్యావరణ వేత్తలు, ప్రతిపక్షాల మధ్య తీవ్ర వివాదం నడుస్తోంది. ఈ పరిణామాలన్నిటిపై ఈ నెల 20న ప్రారంభమవనున్న పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో ప్రతిపక్షాలు తీవ్ర గందరగోళం సృష్టించేందుకు సన్నద్ధం కావచ్చు. అయితే ప్రతిపక్షాలు అనేవి ఎక్కడున్నాయి? ఇండియా కూటమిలో కీలక భాగస్వాములైన తృణమూల్ కాంగ్రెస్, శివసేన, ఆమ్ ఆద్మీ పార్టీల్లోంచి భారీ ఫిరాయింపులు జరగడంతో ఆ పార్టీలు అస్తిత్వం కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. తమిళనాడులో టీవీకేతో కాంగ్రెస్ చేతులు కలిపిన తర్వాత ఆ జాతీయ పార్టీకి డీఎంకే దూరమైంది. శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ కూడా తీవ్ర సంక్షోభంలో ఉన్నది. ఇటీవలి రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీ నిలబెట్టిన స్వతంత్ర అభ్యర్థిని గెలిపించిన తర్వాత జార్ఖండ్ ముక్తి మోర్చా ఉనికి ప్రశ్నార్థకమైంది. తాము ఇండియా కూటమిలో భాగం కాదని ఆమ్ ఆద్మీ పార్టీ ఇప్పటికే ప్రకటించింది. ఈ దృష్ట్యా పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో కాంగ్రెస్, మరికొన్ని పార్టీలు ఒకటి రెండు రోజులు గందరగోళం సృష్టించినా, ఆ తర్వాత బీజేపీ తన అజెండాను నెరవేర్చుకునేందుకు ఎలాంటి అడ్డూ లేకపోవచ్చు. పార్లమెంటు వర్షాకాల సమావేశాలకు ముందే ప్రతిపక్షాలు తీవ్రంగా బలహీనం కావడం, పార్లమెంటు రూపురేఖలు మారడం దేశ రాజకీయాల్లో కీలకమైన పరిణామం అని చెప్పక తప్పదు. ఇంతకంటే ముఖ్యమైనది 130వ రాజ్యాంగ సవరణ బిల్లు, 131వ రాజ్యాంగ సవరణ బిల్లును మళ్లీ ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం సన్నద్ధం కావడం. గత ఏప్రిల్‌లోనూ, తర్వాత జరిగిన ప్రత్యేక సమావేశాల్లోనూ ఈ బిల్లులను ప్రతిపక్షాలు బలంగా అడ్డుకోవడంలో విజయం సాధించాయి. ఇప్పుడా పరిస్థితి లేదు. ఈ రెండు బిల్లులూ ఆమోదం పొందితే దేశ రాజకీయ, రాజ్యాంగ వ్యవస్థల్లో కొన్ని కీలక మార్పులు జరుగుతాయని అందరూ గట్టిగా భావిస్తున్నారు. ఈసారి మహిళలకు రిజర్వేషన్ కల్పించే రాజ్యాంగ సవరణ బిల్లుతో పాటు నియోజకవర్గాల పునర్విభజన బిల్లులకు రెండింట మూడవ వంతు మెజారిటీ సాధించేందుకు ప్రభుత్వం ఇప్పటికే రంగం సిద్ధం చేసింది. ఈ బిల్లు ఆమోదం పొందితే ప్రస్తుతం జరుగుతున్న జనాభా లెక్కల సేకరణతో నిమిత్తం లేకుండా గత జనాభా లెక్కల ప్రకారమే నియోజకవర్గాల పునర్విభజన జరిగి తీరుతుంది. ఈసారి పెరిగే సీట్ల సంఖ్యను కూడా నిర్దిష్టంగా బిల్లులో సూచించే అవకాశాలున్నాయి. అంతేకాదు, ప్రభుత్వం ఏర్పర్చే డీలిమిటేషన్ కమిషన్ దేశవ్యాప్తంగా పలు నియోజకవర్గాల భౌగోళిక సరిహద్దులను కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రయోజనాలకు అనుగుణంగా మార్చివేసే అవకాశం ఉంటుందనడంలో సందేహం లేదు.

# 14న ఏపి వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం

### - ఇళ్ల స్థలాలు పెన్షన్లు అజెండాగా తీర్మానాలు
### - ప్రభుత్వం దృష్టికి పెండింగ్ సమస్యలు





**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఈనెల 14న విజయవాడలో నిర్వహించనున్నట్లు జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి (ఎన్ఏజె) గంట్ల శ్రీనుబాబు, విశాఖ జిల్లా అధ్యక్షులు పి.నారాయణలు తెలిపారు. మంగళవారం ఇక్కడ అక్కయ్యపాలెం జంక్షన్ వద్ద ఒక ప్రయివేట్ హోటల్‌లో ఏపి వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, బ్రాడ్ కాస్ట్, స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్‌ల జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో చర్చించాల్సిన పలు అంశాలపై నిర్ణయాలు తీసుకోవడం జరిగిందని గంట్ల శ్రీనుబాబు, నారాయణలు వివరించారు. ప్రధానంగా రాష్ట్రంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు కేటాయించాలని కోరడం జరుగుతుందన్నారు.

ఇప్పటికే ఈ విషయంపై ప్రభుత్వానికి పలు సం దర్భాల్లో వినతిపత్రాలు అందజేశామన్నారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తి కావచ్చిన తరుణంలో మరోసారి ఇళ్ల స్థలాల కేటాయింపు విషయమై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లాలని నిర్ణయించడం జరిగిందన్నారు. అలాగే వర్కింగ్ జర్నలిస్టులకు ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్న పెన్షన్ విధానం ఆంధ్రప్రదేశ్‌లో కూడా అమలు చేయాలని వర్కింగ్ జర్నలిస్టులకు ఎంతో బాసటగా ఉండే ప్రమాధ భీమాను తిరిగి పునరుద్ధరించాలని కూడా కోరడం జరుగుతుందన్నారు. సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల ప్రధాన సమస్యలను మరోసారి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామన్నారు. అలాగే ఆయా అంశాలపై 14న విజయవాడ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలోనూ చర్చించి అవసరమైన మేరకు తీర్మానాలు చేస్తామన్నారు. ఇంకా ఆయా జిల్లాల్లో నిర్వహించాల్సిన మహాసభలు, రాష్ట్ర సమావేశాలపై కూడా ఆ సమావేశంలో తుదినిర్ణయం తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇప్పటికే అన్ని జిల్లాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాలు పూర్తి చేశామన్నారు. త్వరలో జాతీయ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులను జిల్లాల వారీగా నామినేట్ చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో విశాఖ జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాసరావు, బ్రాడ్ కాస్ట్ అధ్యక్ష కార్యదర్శులు ఇరోతి. ఈశ్వరరావు, కింతాడ. మధన్, స్మాల్ అండ్ మీడియం విశాఖ అధ్యక్షులు జగన్ మోహన్, కార్యదర్శి కె.శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీలు డి.రవికుమార్ పితాని సూర్యప్రసాద్, ఉపాధ్యక్షులు బండారు శివప్రసాద్, ఎన్.రామకృష్ణ, గొడబ రాంబాబు, జాయింట్ సెక్రెటరీ పి.రవిశంకర్, ఉపాధ్యక్షులు కిషోర్ నగేష్ బాబు, రాజశేఖర్ స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు బొబ్బర ప్రసాద్, ట్రెజరర్ కెవి. శర్మ, కార్యవర్గ సభ్యులు అరుణ్ భాస్కర్ (హరి), తదితరులు పాల్గొన్నారు.



## ప్రహ్లాదపురంలో ఘోరం: వృద్ధురాలిని హత్య చేసి, బంగారం దోచుకెళ్లిన దుండగులు

**విశాఖ/ పెందుర్తి, (రాజధాని వార్తలు):** స్థానిక ప్రహ్లాద పురంలో అర్ధరాత్రి వేళ ఓ దారుణ ఘటన వెలుగు చూసింది. ఇంట్లో ఒంటరిగా నిద్రిస్తున్న కర్రీ పైడమ్మ (72) అనే వృద్ధు రాలిని గుర్తు తెలియని దుండగులు అత్యంత కిరాతకంగా దాడి చేసి హత్య చేశారు. అనంతరం ఆమె శరీరంపై ఉన్న బంగారు ఆభరణాలను దోచుకుని పారిపోయారు. ఉదయం గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే 112 ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పెందుర్తి సీఐ సతీశ్ కుమార్ తన సిబ్బందితో కలిసి వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్లూస్ టీమ్ రంగంలోకి దిగి అక్కడ లభించిన ఆధారాలను సేకరించింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తును వేగవంతం చేశారు. ఈ ఘోర కలికలం స్థానిక ప్రజల్లో తీవ్ర భయాందోళనలను కలకలాన్ని రేపింది.

# దక్షిణ వైసీపీలోకి 100 మంది జనసేన కుటుంబాలు

### - కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించినా మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** దక్షిణ నియోజక వర్గం 30వ వార్డు నుండి జనసేన పార్టీకి చెందిన 100 మంది కుటుంబాలు వైఎస్సార్సీపీలోకి చేరారు. ఆ వార్డు వైఎస్ఆర్సిపి అధ్యక్షుడు దశమంతుల మాణిక్యాలరావు ఆధ్వర్యంలో వార్డు వాజ సెల్ అధ్యక్షురాలు దశమంతుల సంతోషి నిర్వహణలో వారంతా పార్టీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ సమక్షంలో చేరిన జనసేన పార్టీకి చెందిన వారందరికీ వైఎస్ఆర్సిపి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వాసుపల్లి గణేష్కుమార్ మాట్లాడుతూ ప్రశ్నిస్తానని చంద్రబాబుతో జతకట్టిన పవన్ కళ్యాణ్‌కు రోజు రోజుకి చుక్కెదరవుతుందన్నారు. ఆయన గ్రాఫ్ దిగజారిపోతున్న ఇప్పటికీ చంద్రబాబు బందీలోనే ఉన్నాడని ఆరోపించారు. కనీసం పవన్ కళ్యాణ్‌తో నడిచిన నేతలకు గానీ కార్యకర్తలకు గానీ ఎటువంటి భరోసా కల్పించలేకపోయాడన్నారు. చివరికి వారి ఉన్న ప్రాంతాన్ని కూడా వారు ఏమీ చేయలేకపోతున్నాం అన్న బాధతో మళ్ళీ అభివృద్ధి సంక్షేమం కోసం వైఎస్సార్సీపీలోకి చేరారన్నారు. నేడు పార్టీలో జాయిన్ అయినా కోడిపందాలు వీధికి చెందిన వారి ప్రాంతంలో ద్విచక్ర వాహనం వెళ్లడానికి కూడా కష్టంగా ఉండేది అన్నారు.వాసుపల్లి హయంలోనే వారి ప్రాంతంలో రోడ్లను విస్తరించి నేడు అంబులెన్సులు కూడా వెళ్లే మార్గాన్ని కల్పించానని గుర్తు చేశారు. జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో దక్షిణ నియోజకవర్గ అభివృద్ధి జరిగిందన్నారు. మళ్లీ అటువంటి అభివృద్ధిని కోరుకుని వైయస్ఆర్సీపీకి తిరిగి చేరుతున్నారని వాసుపల్లి స్పష్టం చేశారు. ఇక ఓటు వేసిన యువతకు, మహిళలకు, అన్ని వర్గాల ప్రజలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలతో మోసం చేశారని వాసుపల్లి ధ్వజమెత్తారు. చివరికి



ప్రజలకు కష్టం వచ్చినా కనిపించని నేతలను గెలిపించుకున్నందుకు ప్రజలు సిగ్గు పడుతున్నారన్నారు. చంద్రబాబు లోకేష్ పవన్ కళ్యాణ్‌లకు జనాలు చీకొట్టే రోజులు దగ్గర పడ్డాయన్నారు. సనాతన ధర్మం పేరిట కుల మతాలను వారిగా విడగొట్టి ప్రజలను రెచ్చగొట్టడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రజలకు ఇచ్చిన హామీలు, సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. వైయస్సార్సీపి అధికారంలోకి వస్తేనే ప్రజలకు మంచి రోజులు వస్తాయని వాసుపల్లి అన్నారు. జగన్మోహన్ రెడ్డి పేరు, ఆయనపై ప్రజలు చూపుతున్న అభిమానాన్ని చూసి తట్టుకోలేక తప్పుడు కేసులు బనాయించి చంద్రబాబు చేస్తున్న కుతంత్ర రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో స్టేట్ ఆర్టిఐ ప్రెసిడెంట్ దశమంతులు చిన్ని, స్టేట్ బీసీ సెల్ సెక్రటరీ లండ రమణ, జిల్లా ఆర్టిఏ ప్రెసిడెంట్ వడ్డది దిలీప్, జిల్లా మహిళా విభాగం నాయాకులు దశమంతులు రామలక్ష్మి, జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు కోనశంకర్, సౌత్ యూత్ ప్రెసిడెంట్ తాడి రవితేజ, సౌత్ అనుబంధ సంఘాల ప్రెసిడెంట్ సువార్త రాజు, లీలా కృష్ణ, వాసుపల్లి బంగారమ్మ, ఆకుల శ్యామ్, వి.టి.కృష్ణ, సూరిని రాము, ముత్తబత్తుల రమేష్, ఏరినమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## సర్ నమోదుకు ప్రజలు సహకరించాలి: ఎమ్మెల్యే



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** ప్రస్తుతం జరుగుతున్న సర్ సర్వేలో ప్రజలందరూ భాగస్వా ములై నూరుశాతం నమోదులు పూర్తి అయ్యేలా సహకరించాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. సామర్లకోట పట్టణంలో జరుగుతున్న సర్ పక్రియను పెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాయల చినరాజప్ప మంగళవారం పరిశీలించారు. అయెద్యరామపురంలో బిఎల్వోలతో ఆయన మాట్లాడి సర్ పక్రియ, నమోదు అవుతున్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చినరాజప్ప మాట్లాడుతూ భారతదేశ వ్యాప్తంగా సర్ పక్రియ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ప్రతీ ఒక్కరు సర్ పక్రియలో పాల్గొని తమ ఓటును నమోదు చేసుకోవాలన్నారు. అలాగే బిఎల్‌ఓలు ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా సర్ పక్రియ పారదర్శకతతో నిర్వహించాలని, ఎలాంటి పొరపాట్లు జరగకుండా ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అడబాల కుమార స్వామి, బలుసు వాసు, వల్లూరి దొరబాబు, తాతపూడి అరుణ్ వంశీ, త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

## జెడ్పి పాఠశాలలో ఆర్జెడి ఆకస్మిక తనిఖీలు



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట మండలం జి.మేడపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం కాకినాడ ప్రాంతీయ సంయుక్త విద్యాశాఖ సంచాలకురాలు (ఆర్ జె డి) జి నాగమణి ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. పాఠశాల నిర్వహణ, విద్యా ప్రమాణాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా గత విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షా ఫలితాలను సమీక్షించిన ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అలాగే 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ అందించాలని ఆదేశించారు. పాఠశాల హాజరు శాతాన్ని మరింత పెంచేందుకు చర్యలు తీసుకోవా లని సూచించిన ఆర్జేడీ, పదో తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడి చదువుపై దృష్టి సారించాలని, లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని ప్రోత్సహించారు. విద్యార్థులకు పలు స్ఫూర్తిదాయక విషయాలను తెలియజేశారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించిన ఆమె ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటివరకు 98 మంది కొత్త విద్యార్థులు చేరడం, అందులో ప్రైవేట్ పాఠశాలల నుంచి గణనీయ సంఖ్యలో విద్యార్థులను ఆకర్షించడం, అలాగే గత సంవత్సరం విద్యార్థుల సంఖ్యను నిలుపుకోవడంలో విజయవంతమైనందుకు హెడ్మాస్టర్, ఉపాధ్యాయ బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపు కోసం ఉపాధ్యాయులు మరింత సమన్వయంతో పనిచేయాలని ఆర్జేడీ నాగమణి హెడ్మాస్టర్ పాండవులను ఆదేశించారు.

## జిల్లా సివిల్ సప్లైస్ కమిటీలో సభ్యుడిగా చాట్ర ఇమ్మానియేల్ నియామకం

### - ఎమ్మెల్యే పంతం నానాజీని మర్యాదపూర్వకంగా కలిసిన చాట్ర ఇమ్మానియేల్




**కరప, (రాజధాని వార్తలు):** కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీను మంగళవారం ఆయన క్యాంపు కార్యాలయంలో జిల్లా సివిల్ సప్లైస్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా నియమితులైన చాట్ర ఇమ్మానియేల్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తనకు జిల్లా సివిల్ సప్లైస్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ బాధ్యతలు అప్పగించినందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేస్తూ సాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కరప వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముద్రగడ రమేష్, కరప మండల జనసేన పార్టీ అధ్యక్షుడు బండారు మురళి, సీనియర్ నాయకులు బోగిరెడ్డి కొండబాబు, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లూరి రాజా, మాల కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లాబత్తుల అప్పారావు, మెండు గోవిందు, పలివెల అనంత రవికుమార్, తాతపూడి అప్పారావు, నేదునూరి చినబాబు తదితరులు పాల్గొని చాట్ర ఇమ్మానియేల్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

# రకుల్ ప్రీత్ సింగ్ గ్లామర్ షో.. లెహంగా లుక్‌తో నెటిజన్లు ఫిదా!



టాలీవుడ్ గ్లామర్ బ్యూటీ రకుల్ ప్రీత్ సింగ్ ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్న సరికొత్త ఫొటోలు ఇప్పుడు ఇంటర్నెట్‌ను షేక్ చేస్తున్నాయి. సౌత్ నుంచి నార్త్ దాకా అందరినీ తన యాక్టింగ్‌తో కట్టిపడేసిన ఈ క్రేజీ హీరోయిన్, తాజాగా నెవ్వర్ బిఫోర్ అనదగ్గ ట్రెడిషనల్ అవతారంలో మెరిసిపోయింది. ఒకప్పుడు సినిమాలతో వెండితెరను ఏలిన ఈ ముద్దుగుమ్మ, ఇప్పుడు సోషల్ మీడియా వేదికగా తన లేటెస్ట్ ఫ్యాషన్ సెన్స్‌తో అభిమానులను ఎలా ఫిదా చేస్తుందో చూద్దాం. రకుల్ ధరించిన డ్రెస్ విశేషాలు ఇవే: "కలల చూపులు.. కాంతులు వెదజల్లే మనసు" అంటూ తాజా ఫొటోషూట్‌ను అభిమానులతో పంచుకుంది..ఇక రకుల్ ట్రెడిషనల్ అండ్ మోడ్రన్ లుక్ కలగలిసిన లెహంగాలో మెరిసిపోయింది. ప్రముఖ డిజైనర్ 'సావన్ గాంధీ' డిజైన్ చేసిన ఓంబ్రే మెటాలిక్ సీక్విన్స్ లెహంగాను ఆమె ధరించింది. ఇక ఈ లెహంగా షేడ్స్ మారుతూ ఎంతో అందంగా కనిపిస్తోంది. దీనికి కాంబినేషన్‌గా డీప్ నెక్ ఎంబ్రాయిడరీ స్లీవ్‌లెస్ చోలీ బ్లౌజ్, బోర్డర్లలో చిన్న చిన్న క్రిస్టల్స్ ఉన్న మ్యాచింగ్ ట్యుల్లే సిల్క్ దుపట్టాను రకుల్ మ్యాచ్ చేసింది. ఇక ఈ డ్రెస్‌లో రకుల్ చాలా రాయల్‌గా కనిపిస్తోంది. మోడలింగ్ నుండి టాలీవుడ్ స్టార్ హీరోయిన్ దాకా: రకుల్ ప్రీత్ సింగ్ తన కెరీర్‌ను మోడల్‌గా ప్రారంభించి, 2009లో 'గిల్లి' అనే కన్నడ సినిమాతో వెండితెరకు పరిచయమైంది. తెలుగులో 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్' సినిమాతో ఈమెకు సూపర్ బ్రేక్ వచ్చింది. ఆ తర్వాత 'లౌక్యం', 'నాన్నకు ప్రేమతో', 'సరైనోడు' వంటి బ్యాక్ టు బ్యాక్ బ్లాక్‌బస్టర్ హిట్స్‌తో టాలీవుడ్ టాప్ స్టార్ హీరోలందరి సరసన నటించి స్టార్ హీరోయిన్‌గా సత్తా చాటింది. ఇక 15 ఏళ్లకు పైగా కెరీర్‌లో ఎన్నో ఫిలింఫేర్ నామినేషన్లను కూడా దక్కించుకుంది. తెలుగులో కెరీర్ పీక్ స్టేజ్‌లో ఉండగానే రకుల్ బాలీవుడ్ వైపు అడుగులు వేసింది. 2014లో 'యారియాన్' సినిమాతో హిందీ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చి, ఆ తర్వాత 'దే దే ప్యార్ దే', 'డాక్టర్ జి' వంటి సినిమాలతో అక్కడ కూడా మంచి గుర్తింపు తెచ్చుకుంది. ప్రస్తుతం రకుల్ చేతిలో బాలీవుడ్ క్రేజీ ప్రాజెక్ట్ 'పతి పత్ని ఔర్ వో దో'తో పాటు కమల్ హాసన్ సరసన ప్రతిష్టాత్మక చిత్రం 'ఇండియన్ 3' కూడా ఉంది. ప్రస్తుతం సినిమాల స్పీడ్ కాస్త తగ్గించినప్పటికీ, రకుల్ ఒక అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్ట్‌లో భాగమైంది. నితీష్ తివారి దర్శకత్వంలో భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న 'రామాయణం' సినిమాలో రకుల్ 'శూర్పణఖ' అనే నెగెటివ్ షేడ్స్ ఉన్న పవర్‌ఫుల్ పాత్రలో నటిస్తోంది. ప్రస్తుతం పెద్దగా సినిమాలు చేయకపోయినా సోషల్ మీడియా ద్వారా రకుల్ ఎప్పుడూ తన ఫ్యాన్స్‌కు టచ్‌లోనే ఉంటోంది. నిత్యం కొత్త కొత్త గ్లామర్ అండ్ ఫిట్‌నెస్ ఫొటోలను షేర్ చేస్తూ నెటిజన్లను ఖుషీ చేస్తోంది. ఇక ఈ లేటెస్ట్ మెటాలిక్ లెహంగా ఫొటోలు కూడా రకుల్ ఫ్యాషన్ సెన్స్‌కు అద్దం పడుతున్నాయి. మరి ఈ బ్యూటీ రాబోయే సినిమాలతో ఎలాంటి హిట్స్ అందుకుంటుందో చూడాలి.

# మార్క్ మై ట్వీట్.. ఒక్క పోస్టుతో హైప్ పెంచేసిన ది ప్యారడైజ్



నేచురల్ స్టార్ నాని, డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో రూపొందుతున్న పాన్ ఇండియా సినిమా ది ప్యారడైజ్ రిలీజ్‌కు ఇంకా టైమ్ ఉన్నప్పటికీ, ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల సినిమా క్లైమాక్స్‌కు సంబంధించిన ఓ సోషల్ మీడియా పోస్ట్ ఈ ప్రాజెక్ట్ చుట్టూ ఉన్న ఆసక్తిని మరింత పెంచింది. ముఖ్యంగా ఈ సినిమాలో ఆయా షేర్ సాంగ్‌కు లిరిక్స్ అందించిన కాసర్ల శ్యామ్ నుంచి వచ్చిన రెస్పాన్స్ కావడంతో అభిమానులు దానిని మరింత ఆసక్తిగా చర్చించుకుంటున్నారు. సినిమా షూటింగ్‌ను డైరెక్ట్‌గా చూసిన తర్వాత చేసిన ఆ ట్వీట్‌లో మార్క్ మై ట్వీట్ అనే కామెంట్ ప్రత్యేక ఆకర్షణగా మారింది. సాధారణంగా సినిమా రిలీజ్‌కు ముందు యూనిట్ సభ్యులు ఇలాంటి కామెంట్స్ చేయడం అరుదు. అందుకే ఈ ఒక్క కామెంట్‌తోనే సోషల్ మీడియాలో ది ప్యారడైజ్ పేరు ట్రెండింగ్‌లోకి వచ్చింది. క్లైమాక్స్‌లో అసలు ఏముంటుందో, ఎలాంటి ట్విస్ట్ లేదా ఎమోషనల్ హై ఉంటుందో అంటూ ఫ్యాన్స్ తమ తమ అంచనాలను సోషల్ మీడియా వేదికగా పంచుకుంటున్నారు. ఫ్యాన్ పేజీలు, సినీ గ్రూపులు, ఎక్స్ పోస్టుల్లో ఈ అంశంపైనే చర్చ కొనసాగుతోంది. ఇక నాని కెరీర్ పరంగా చూసినా ఈ సినిమా అత్యంత కీలక ప్రాజెక్ట్‌గా భావిస్తున్నారు. దసరాతో మాస్ ఇమేజ్‌ను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లిన నాని, అదే డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెలతో మరోసారి జతకట్టడం ఈ సినిమాకు ప్రధాన బలంగా మారింది. దసరా సినిమాలో ఎమోషన్స్, యాక్షన్, పాత్రల తీరు ప్రేక్షకులను ఆకట్టుకున్న నేపథ్యంలో, ది ప్యారడైజ్ ఆ అంచనాలను మరింత పెంచిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అందుకే ఈ సినిమా క్లైమాక్స్ నాని కెరీర్‌లోనే గుర్తుండిపోయే ఘట్టంగా నిలుస్తుందా అనే డిస్కషన్ కూడా సినీ వర్గాల్లో మొదలైంది. మరోవైపు డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల విజన్‌పై కూడా ఇండస్ట్రీలో మంచి నమ్మకం కనిపిస్తోంది. శ్రీకాంత్ కథ చెప్పే విధానం, పాత్రల నిర్మాణం, ఎమోషన్స్ ను స్క్రీన్ పై ప్రెజెంట్ చేసే తీరు ఆయనకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చాయి. దీంతో ది ప్యారడైజ్ చివరి భాగంలో ఆయన మరోసారి తన మార్క్ చూపించబోతున్నారనే అభిప్రాయం అభిమానుల్లో బలపడుతోంది. ఈ సినిమాకు అనిరుధ్ రవిచందర్ అందిస్తున్న బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కూడా క్లైమాక్స్‌ను మరింత ఎఫెక్టివ్‌గా మార్చే అంశంగా భావిస్తున్నారు. ఇప్పటికే సినిమాపై ఉన్న పాన్ ఇండియా బజ్‌కు ఈ తాజా సోషల్ మీడియా రెస్పాన్స్ మరింత ఊపు తీసుకొచ్చింది. రిలీజ్‌కు ఇంకా నెలల టైమ్ ఉన్నప్పటికీ, ఒక్క ట్వీట్‌తోనే ఆడియన్స్‌లో క్యూరియాసిటీని పీక్స్‌కు తీసుకెళ్లిన ది ప్యారడైజ్ ఇప్పుడు టాలీవుడ్‌లో అత్యంత ఆసక్తిగా ఎదురు చూస్తున్న సినిమాల లిస్ట్‌లో మరింత బలంగా నిలిచింది.

# చీరలో అనసూయ స్టన్నింగ్ లుక్.. సోషల్ మీడియా ట్రెండింగ్‌లో కొత్త పిక్స్!



బుల్లితెరపైనే కాదు, వెండితెరపై కూడా తనదైన ముద్ర వేసిన నటి, యాంకర్ అనసూయ భరద్వాజ్ మరో అరుదైన రికార్డును సొంతం చేసుకుంది. హైదరాబాద్‌లో జరిగిన ప్రతిష్టాత్మక TEDx ఈవెంట్‌లో ఆమె స్పీకర్‌గా పాల్గొని అదరగొట్టింది. ఈ ఈవెంట్ కోసం అనసూయ ఎర్రటి చీరలోని ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ ట్రెండ్ అవుతున్నాయి. సాంప్రదాయానికి కాస్త మోడ్రన్ టచ్ ఇస్తూ ఆమె చేసిన సరికొత్త ప్రయోగం నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటోంది. లైఫ్‌లో ఎన్నో ఆటంకాలను ఎదుర్కొని నిలబడిన అనసూయ, TEDxIMT హైదరాబాద్ వేదికపై తన జీవిత అనుభవాలు, కెరీర్ ప్రయాణం గురించి పవర్‌ఫుల్ స్పీచ్ ఇచ్చింది. తన కల నిజమైన సంతోషంలో "నా మొదటి TEDx టాక్.. అచీవ్‌మెంట్ అన్‌లాక్డ్" అంటూ ఇన్ స్టాలో ఎమోషనల్ పోస్ట్ పెట్టింది. ఆ ఐకానిక్ రెడ్ సర్కిల్‌పై నిలబడి మాట్లాడటం తన లైఫ్‌లో ఒక బ్యూటిఫుల్ రిమైండర్ అని, ఈ ఈవెంట్ తర్వాత మరికొన్ని భయాలను, అలాగే మరికొన్ని కిలోల బరువును కూడా తగ్గించుకున్నానని సరదాగా చెప్పుకొచ్చింది. ఈ ఈవెంట్ కోసం అనసూయ ఎంచుకున్న అవుట్‌ఫిట్ అందరినీ కట్టిపడేసింది. ఆమె మంచి ఎరుపు రంగు హ్యాండ్లూమ్ చీరను ధరించింది. పల్లూ భాగంలో అడ్డంగా వచ్చిన డిజైన్ లైన్స్ ఈ చీరకు ఒక ప్రత్యేకమైన లుక్‌ను తీసుకొచ్చాయి. ఇక దీనికి కాంబినేషన్‌గా అదే డీప్ రెడ్ కలర్ గల స్లీవ్‌లెస్ బ్లౌజ్‌ను మ్యాచ్ చేసింది. ఈ డ్రెస్సింగ్‌లో అనసూయ ఎంతో క్లాసిగా, రాయల్‌గా మెరిసిపోయింది. ఈ ఫొటోషూట్‌లో అందరినీ సర్ప్రైజ్ చేసిన విషయం ఏంటంటే, అనసూయ చీర కింద హై-కట్ బ్లాక్ కలర్ బూట్స్ వేసుకుంది. సాంప్రదాయ చీర కట్టుకు, ఈ మోడ్రన్ బూట్స్ తోడవడంతో ఇదొక క్రేజీ ఇండో వెస్ట్రన్ ఫ్యూజన్ లుక్‌లా మారిపోయింది. ఇక ట్రెడిషనల్ లుక్‌లోనూ తన స్టైలిష్ అండ్ ట్రెండీ మార్క్ చూపించడంలో అనసూయ రూటే సెపరేట్ అని ఈ పిక్స్ చూస్తే అర్థమవుతోంది. కేవలం యాంకరింగ్‌కే పరిమితం కాకుండా వైవిధ్యమైన పాత్రలతో అనసూయ దూసుకుపోతోంది. ప్రస్తుతం ఆమె చేతిలో క్రేజీ ప్రాజెక్టులు ఉన్నాయి. పుష్పతో సూపర్ సక్సెస్ అందుకున్న అనసూయ ఇటీవల వచ్చిన నాగబంధం మూవీతో హిట్ అందుకుంది. ఇక 'ఫ్లాష్ బ్యాక్', 'తోడేలు' వంటి చిత్రాల్లో ఆమెకీలక పాత్రలు పోషిస్తోంది. వీటితో పాటు మలయాళంలో 'ఉల్ఫ్' అనే సినిమాతో అక్కడి ప్రేక్షకులను కూడా పలకరించి అలరించింది. స్టైల్ ఐకాన్‌గా ఉంటూనే, సమాజంలో తన గళాన్ని గట్టిగా వినిపించే అనసూయకు టాక్ ఒక అద్భుతమైన గౌరవమనే చెప్పాలి. టాలెంట్‌తో పాటు గ్లామర్‌ను బ్యాలెన్స్ చేస్తూ నిత్యం వార్తల్లో నిలిచే ఈ బ్యూటీ, రాబోయే సినిమాలతో ఎలాంటి సక్సెస్‌లు అందుకుంటుందో చూడాలి. ప్రస్తుతానికైతే ఈ ఎర్రటి చీర సొగసులతో నెట్టింట మంటలు పుట్టిస్తోంది అనసూయ.

# భవిష్యత్తు మాతృత్వం కోసం 10 మంది నటీమణుల ప్రయోగం!



ప్రస్తుత ఆధునిక కాలంలో మహిళలు కెరీర్, వ్యక్తిగత కారణాల వల్ల మాతృత్వాన్ని వాయిదా వేసుకుంటున్నారు. ఈ క్రమంలో తమ సంతానోత్పత్తి సామర్థ్యాన్ని భవిష్యత్తు కోసం సురక్షితంగా దాచుకునేందుకు ఎగ్ ఫ్రీజింగ్ (అండాలను భద్రపరచడం) అనే సరికొత్త వైద్య ప్రక్రియను ఎంచుకుంటున్నారు.

గతంలో దీనిపై పెద్దగా అవగాహన లేకపో యినా ఈ మధ్యకాలంలో పలువురు భారతీయ మహిళా సెలబ్రిటీలు తాము ఈ ప్రక్రియను ఎంచుకున్నట్లు బహిరంగంగా మాట్లాడటం వల్ల సమాజంలో దీనిపై అవగాహన, సానుకూల చర్చలు బాగా పెరిగాయి. గ్లోబల్ స్టార్ ప్రియాంకా చోప్రా తన 30 ఏళ్ల వయసులోనే అండాలను భద్రపరుచుకున్నట్లు ప్రకటించి ఎందరికో స్ఫూర్తిగా నిలిచారు. కెరీర్‌లో బిజీగా ఉండటం వల్లే భవిష్యత్తులో తల్లి అయ్యే అవకాశాన్ని కాపాడుకోవడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అలాగే భారత మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ కూడా తన క్రీడా కెరీర్.. వ్యక్తిగత లక్ష్యాల మధ్య సమతుల్యత కోసమే తన 30 ఏళ్ల వయసులో ఈ ఆప్షన్‌ను ఎంచుకున్నారు. ప్రముఖ కొరియోగ్రాఫర్, సినిమా దర్శకురాలు ఫరా ఖాన్ సైతం తన పునరుత్పత్తి ఆరోగ్యాన్ని సురక్షితంగా ఉంచుకోవడానికి, భవిష్యత్తులో కుటుంబ నియంత్రణ కోసం ఈ ప్రక్రియను ఎంచుకున్నట్లు వెల్లడించారు. ఇక టెలివిజన్ రంగంలో సంచలనాలు సృష్టించిన ప్రముఖ ప్రొడ్యూసర్ ఏక్తా కపూర్ తన 36 ఏళ్ల వయసులో అండాలను ఫ్రీజ్ చేయించుకుని... ఆ తర్వాత సరోగసీ ద్వారా తన కుమారుడు రవీకి జన్మనిచ్చారు.

# సహజ సిద్ధ పద్ధతిలో బీజామృతంతో విత్తన శుద్ధితో తెగుళ్ళకు పూర్తి నివారణ

## - నేచురల్ ఫార్మింగ్ అసోసియేట్ జి.అన్నపూర్ణ - నంద, పనసభద్ర గిరిజన గ్రామాల్లో సామూహిక విత్తన శుద్ధి




**మక్కువ, (రాజధాని వార్తలు):** బీజామృతంతో విత్తన శుద్ధి చేసుకోవడం వల్ల తెగుళ్లు తొలి దశలోనే నివారించుకోవచ్చుకొని నేచురల్ ఫార్మింగ్ అసోసియేట్ జి.అన్నపూర్ణ అన్నారు. మండలంలో నంద, పనసభద్ర గిరిజన గ్రామాల రైతులతో బీజామృతంతో సామూహిక విత్తన శుద్ధి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీజామృతంతో విత్తన శుద్ధి చేసుకోవడం విత్తనం నుండి గాని, భూమి నుండి గానీ ఎటువంటి తెగుళ్ళు మొక్కకు రాకుండా నివారించుకోవచ్చన్నారు. విత్తనం నాటిన తర్వాత చీమలు, పక్షులు తినకుండా ఉండడమే గాక, 90 శాతం మొలక శాతం వచ్చి, నారు ఏపుగా పెరుగుతుందని సూచించారు. వరి నారు వేసే ప్రతీ రైతు కూడా బీజామృతంతో విత్తన శుద్ధి చేసి, నారు మడిలో వేసుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో రైతులు రెడ్డి ధర్మారావు, సిద్ధ సోములు, భీముడు, జన్ని వనజాక్షి, గులివిందల అశోక్, మండల ఇంచార్జ్ ఉర్లక నాగార్జున, మోడల్ మేకర్ ధన బాబు, ఐసీఆర్పీలు సుందరరావు గౌరీశ్వరి, అప్పలరాజు, భవాని, తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణ వార్డు-50లో ఎస్ఐఆర్ కార్యక్రమాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి





**విజయనగరం, (రాజధాని వార్తలు):** విజయనగరం నగరంలోని కాళీఘాట్ కాలనీ సచివాలయం పరిధిలోని స్వర్ణ వార్డు-50లో జరుగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ఎస్ఐఆర్ కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్‌లో భాగంగా చేపడుతున్న డిజిటలైజేషన్ ప్రక్రియను స్వయంగా పరిశీలించి, బూత్ లెవల్ అధికారులకు (బి ఎల్ ఓ లు) తగు సూచనలు జారీ చేశారు. ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా, పూర్తిస్థాయి పారదర్శకతతో, నిర్దేశిత గడువులోగా డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే గైర్హాజరైన, ఇతర ప్రాంతాలకు మారిన, మరణించిన ఓటర్లకు సంబంధించిన వివరాలను ప్రత్యేక జాబితాల రూపంలో సిద్ధం చేసి అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి వివరాన్ని క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా ధృవీకరించి నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కూర్మనాథ్, సంబంధిత రెవెన్యూ అధికారులు, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

# ఉన్నత పాఠశాల విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన కార్యక్రమం

## - సి.ఐ ఎస్.సన్యాసినాయుడు, ఎస్.ఐ యు.మహేష్






**బొండపల్లి,(గజపతినగరం), (రాజధాని వార్తలు):** మండలంలోని గరుడబిల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థిని, విద్యార్థులకు సి.ఐ ఎస్.సన్యాసినాయుడు ఎస్.ఐ యు.మహేష్ అనేక అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఉన్నత పాఠశాల వయసులో చిన్నచిన్న సరదాల కోసం తిరుగుతూ దురలవాట్లకు అలవాటు పడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని సి.ఐ ఎస్. సన్యాసినాయుడు, ఎస్సై యు.మహేష్ అన్నారు. పాఠశాల చదువుతున్న విద్యార్థినులను పాఠశాలకు వచ్చే మార్గంలో గాని, బైకులపై గాని వచ్చి విద్యార్థినుల వెనక పడుతూ ఇబ్బంది పెడితే తప్పనిసరిగా సమీప పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని సి.ఐ ఎస్.సన్యాసి నాయుడు ఎస్.ఐ యు.మహేష్ విద్యార్థినులకు సూచించారు. అటువంటి వారికి పోక్సో చట్టం ప్రకారం కఠినమైన శిక్షలు పడతాయని సి.ఐ సన్యాసినాయుడు ఎస్సై యు.మహేష్ హెచ్చరించారు. ఉన్నత పాఠశాల వయస్సులో మానసిక పరిపక్వత లేని కారణంగా ప్రేమ పేరుతో మోసపోవద్దని వారిరువురూ సూచనలు చేశారు. విద్యార్థినీ, విద్యార్థులు మొబైల్ ఫోన్లు, టాబ్లను సరిగా వాడకపోతే వారి యొక్క వ్యక్తిగత డేటా చోరీ కాబడుతుందని, దానిని ఆసరాగా తీసుకొని సైబర్ నేరగాళ్లు అఘాయిత్యాలకు పాల్పడతారని సి.ఐ ఎస్.సన్యాసినాయుడు ఎస్సై యు మహేష్ విద్యార్థిని విద్యార్థులకు చెప్పారు. అదేవిధంగా విద్యార్థినీ విద్యార్థులు మొబైల్లో తెలియని లింకులను తెరవరాదని సూచనలు చేశారు. ఈ వయసులో తప్పుదారి పట్టే అవకాశం ఉన్నందున సిగరెట్లు, మద్యపానానికి అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సీ.ఐ ఎస్.సన్యాసినాయుడు, ఎస్.ఐ యు మహేష్ విద్యార్థిని విద్యార్థులకు సూచిస్తూ, బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకునే విధంగా విద్యాభ్యాసాన్ని కొనసాగించాలని వారి శ్రేయస్సుని ఆకాంక్షిస్తూ సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# నల్ల బ్యాడ్జీలతో దస్తావేజు లేఖరుల ఆందోళన



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** రిజిస్ట్రేషన్ శాఖలో పీపీపీ (పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్) విధానాన్ని అమలు చేసే నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సామర్లకోటలో దస్తావేజు లాకర్లు చేపట్టిన ఆందోళన రెండవ రోజు మంగళవారం నల్ల బ్యాడ్జీలు ధరించి కొనసాగించారు. సామర్లకోట సబ్ రిజిస్టార్ పరి ధిలో దస్తావేజు లేఖర్లు స్టాంపు వెండర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు విధులు బహిష్కరించి నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర దస్తావేజు లేఖరుల సంఘం నాయకుడు మల్యాల సీతాపతిరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది దస్తావేజు లేఖరులు, స్టాంప్ వెండర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు రిజిస్ట్రేషన్ శాఖపై ఆధారపడి జీవిస్తున్నారని, ప్రైవేటీకరణ వల్ల వారి జీవనోపాధికి తీవ్ర ముప్పు ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి భారీ ఆదాయం సమకూర్చే రిజిస్ట్రేషన్ శాఖను ప్రైవేట్ సంస్థలు లేదా థర్డ్ పార్టీ ఏజెన్సీలకు అప్పగించే ప్రతిపాదనలను విరమించుకోవాలని, జీవో నెం.396ను వెంటనే రద్దు చేయాలని కోరారు. ప్రైవేటీకరణ అమలైతే సామాన్య ప్రజలపై అదనపు సేవా రుసుముల భారం పడటంతో పాటు భూముల కొనుగోలు, విక్రయాల్లో ఇబ్బందులు తలెత్తే అవకాశముందని పేర్కొన్నారు. అలాగే భూముల రికార్డులు, ప్రజల వ్యక్తిగత దస్తావేజుల సమాచారం ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లడం వల్ల అక్రమాలు, భద్రతాపరమైన సమస్యలు ఉత్పన్నమయ్యే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వం తమ పొట్ట పొట్ట వద్దని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సామర్లకోట యూనియన్ అధ్య క్షులు ఎం సీతాపతిరావు, నాయకులు గోగు అప్పారావు, షేక్ లాల్, పేకేటి చిరంజీవి, పేకేటి రాజా, పేకేటి రమేష్, ఎస్ వెంకట్, వి గొల్లబ్బాయి, కోలా నారాయణరావు (బాబులు), టి సూరిబాబు, ఎన్ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# కుప్పంలో మెగా ఫుట్‌వేర్ క్లస్టర్.. దక్షిణ కొరియాలో మంత్రి లోకేశ్ ప్రతిపాదనలు



**ఇంటర్‌నెట్ డెస్క్:** దక్షిణ కొరియా బుసాన్‌లో హ్వాసంగ్ గ్రూప్ ప్రతినిధులతో ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ బుధవారం సమావేశం అయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఏపీలో హ్వాసంగ్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్ ఏర్పాటు చేయాలని ఆహ్వానం పలికారు. కుప్పంలో ఇంటిగ్రేటెడ్ ఫుట్‌వేర్ కాంపోనెంట్ & మెటీరియల్ తయారీ కేంద్రం ఏర్పాటు చేయాలని లోకేశ్ సూచించారు. ఏపీలో నెక్స్ట్‌జెన్ అథ్లెటిక్ ఫుట్‌వేర్ ఆర్అండ్‌డీ, ఆసియా-పసిఫిక్ ఇన్నోవేషన్ సెంటర్ ఏర్పాటు చేయాలని లోకేశ్ విజ్ఞప్తి చేశారు. కుప్పం కేంద్రంగా దక్షిణ భారత సమగ్ర ఫుట్‌వేర్ తయారీ క్లస్టర్‌కు ప్రతిపాదన చేశారు. తిరుపతిలో విడిభాగాల తయారీ, విశాఖపట్నంలో డిజైన్, లాజిస్టిక్స్ హబ్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఏపీలో టైర్-1, టైర్-2 వెండర్లతో సప్లయర్ మీట్ నిర్వహించాలని హ్వాసంగ్‌కు ఆహ్వానం పలికారు. కుప్పంలో రూ.900 కోట్లతో గ్రీన్‌ఫీల్డ్ నాన్ - లెదర్ ఫుట్‌వేర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నట్లు హ్వాసంగ్ ప్రతినిధులు తెలిపారు. ఏడాదికి 2 కోట్ల జతల స్పోర్ట్స్ షూల తయారీ లక్ష్యంగా హ్వాసంగ్ ప్లాంట్ ఏర్పాటు చేయనుందని ప్రతినిధులు వివరించారు. అడిడాస్ సహా గ్లోబల్ బ్రాండ్లకు ఓఈఎం సరఫరాదారుగా హ్వాసంగ్ ఉండనుందని వెల్లడించారు. తొలి దశలో ఎగుమతులు.. ఆపై దేశీయ మార్కెట్‌పై దృష్టి సారించినట్లు చెప్పుకొచ్చారు. ఏపీ ప్రభుత్వ తాజా ప్రతిపాదనలను పరిశీలిస్తామని హ్వాసంగ్ ప్రతినిధులు తెలిపారు.

**షూఆల్స్ ఫ్యాక్టరీని సందర్శించిన లోకేశ్**

అలాగే బుసాన్‌లోని షూఆల్స్ స్మార్ట్ హెల్త్‌కేర్ ఫుట్‌వేర్ ఫ్యాక్టరీని మంత్రి లోకేశ్ సందర్శించారు. అధునాతన టెక్నాలజీతో బూట్ల తయారీ ప్రక్రియను పరిశీలించారు. మెడికల్ మాగ్నెటిక్ జనరేటర్లు, స్మార్ట్ చిప్‌లతో తయారయ్యే షూస్‌పై ఆసక్తి కనపరించారు. పాదాల ఆరోగ్యానికి ప్రత్యేక వైబ్రేషన్ చిప్ టెక్నాలజీని లోకేశ్ పరిశీలించారు. రక్తప్రసరణ మెరుగుదల, కండరాల అలసట తగ్గించే స్మార్ట్ ఫుట్‌వేర్ తయారీ గురించి ఆయన తెలుసుకున్నారు.

**బూ యంగ్ గ్రూప్.. ఆ యూనిట్ ఏర్పాటు చేయాలి..**

'పాదరక్షలు, షూ లేసులు, మెటల్ హార్డ్‌వేర్, అనుబంధ పరికరాల తయారీలో పేరెన్నికగన్న బూ యంగ్ గ్రూప్ సీఈవో & ప్రెసిడెంట్ డైరెక్టర్ ర్యాన్ కాంగ్, బిజినెస్ స్ట్రాటజీ ఒ ప్లానింగ్ మేనేజర్ మిల్లీ రిచర్డ్‌సన్‌లతో బుసాన్‌లో సమావేశమయ్యాను. ఆంధ్రప్రదేశ్‌లో బూ యంగ్ గ్రూప్ పాదరక్షలు, విడిభాగాల తయారీ యూనిట్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశాను. సింగిల్ విండో విధానంలో అనుమతులతోపాటు రాష్ట్రంలో ప్రధాన పారిశ్రామిక జోన్లలో కంపెనీ ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, లాజిస్టిక్ కనెక్టివిటీ సిద్ధంగా ఉన్నాయని వివరించాను' అని లోకేశ్ ఎక్స్‌లో పోస్టు చేశారు.

**అపెక్స్ - కొరియాతో పెట్టుబడులపై చర్చ..**

'దక్షిణ కొరియా ప్రముఖ వాణిజ్య కేంద్రమైన బుసాన్‌లో ఏపీ ఈడీబీ ఆధ్వర్యంలో అపెక్స్ - కొరియా పేరుతో పెట్టుబడిదారుల సహాయక, అనుసంధాన విభాగంను ప్రారంభించాను. రాష్ట్రంలో పెట్టుబడులకు ఆసక్తిచూపే కొరియా సంస్థలకు, ఏపీ ప్రభుత్వానికి మధ్య అపెక్స్ కొరియా అనుసంధానకర్తగా పనిచేయనుంది' అని ఎక్స్‌లో లోకేశ్ పోస్టు చేశారు.

# అన్నదాత భూముల భద్రతే కూటమి ప్రభుత్వ ధ్యేయం

## - ఇమ్మిడివరప్పాడు, ఈదరపల్లిలో లబ్ధిదారులకు "రాజముద్ర"తో కూడిన నూతన పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే





**అమలాపురం, (రాజధాని వార్తలు):** అన్నదాతల భూ హక్కులకు పూర్తి భద్రత కల్పించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. అమలాపురం రూరల్ మండలం ఇమ్మిడివరప్పాడు, ఈదరపల్లి గ్రామాలలో నూతనంగా మంజూరైన రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను ఆయన రైతులకు పంపిణీ చేశారు. గత ప్రభుత్వంలో రైతులు ఎదుర్కొన్న భూ సమస్యలను, ఇబ్బందులను తొలగిస్తూ మన కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అత్యంత పారదర్శకతతో అధికారిక రాజముద్రతో కూడిన నూతన పాస్ పుస్తకాలను అందిస్తోందని అన్నారు.

అన్నదాతల భూ హక్కులకు పూర్తి భద్రత కల్పించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు.

నూతన పాస్ పుస్తకాలు అందుకున్న రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి ముఖ్య నాయకులు, రెవెన్యూ అధికారులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# రైతు బజారులో సరసమైన ధరలకు విక్రయించాలి

## - రైతు బజారును తనిఖీ చేసిన ఎమ్మెల్యే ఆనందరావు





**అమలాపురం, (రాజధాని వార్తలు):** కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు బజారులలో ప్రజలకు నాణ్యమైన కాయగూరలను సరసమైన ధరలకు విక్రయించాలని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. అమలాపురం పట్టణంలోని స్థానిక రైతు బజారును మంగళవారం ఆయన సందర్శించారు. రైతు బజారులోని స్టాళ్లను, ధరల పట్టికను, కూరగాయల విక్రయాలను పరిశీలించారు.

మార్కెట్‌లో అందుబాటులో ఉన్న ధరలు, మౌలిక వసతులపై అక్కడి సిబ్బందిని, అధికారులను ఆరా తీశారు. రైతు బజారు నిర్వహణ సక్రమంగా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయ కులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మాడుగుల నియోజకవర్గంలోని దేవరపల్లి, కె.కోటపాడు, చీడికాడ మండలాల్లో కలెక్టర్ పర్యటన

**- సర్ ఇంటింటి సర్వే వేగవంతం చేయాలి - నిర్ణీత సమయంలో డిజిటలైజేషన్ పూర్తి చేయాలని అధికారులకు, సిబ్బందికి ఆదేశాలు - జిల్లాలో క్షేత్రస్థాయిలో ఎస్ఐఆర్ ప్రక్రియను జాయింట్ కలెక్టర్‌తో కలసి పరిశీలించిన కలెక్టర్ విజయ క్రిష్ణన్**






**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం జిల్లాలో పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జాయింట్ కలెక్టర్ శౌర్య మాన్ పటేల్‌తో కలసి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ మాడుగుల నియోజకవర్గంలోని దేవరపల్లి, కె.కోటపాడు, చీడికాడ మండలాల్లో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) చేపడుతున్న ఫారాల పంపిణీ, స్వీకరణ, నమోదు ప్రక్రియ పురోగతిపై ఆరా తీశారు. అనంతరం దేవరపల్లి, కె.కోటపాడు, చీడికాడ మండల తహశీల్దార్ కార్యాలయాల్లో జాయింట్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్ స్థానిక ఈఆర్వోతో కలిసి ఎస్ఐఆర్‌పై సమీక్షలు నిర్వహించి బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లతో మాట్లాడి ఫారాల పంపిణీ, స్వీకరణ, ధృవీకరణ పనులపై ఆరా తీశారు. అర్హులైన ప్రతి ఓటరుని చేరుకుని ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. డిజిటలైజేషన్ ప్రక్రియను పరిశీలిం చారు. డేటా నమోదు, ధృవీకరణ పనులను నిర్దేశిత గడువులోగా నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు.



# బాలల హక్కుల పరిరక్షణలో నిర్లక్ష్యం వహించరాదు





**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** బాల్య వివాహాలపై ప్రత్యేక దృష్టి సారించాలి అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు ఉండవల్లి గాంధీ బాబు మరియు మండల గంగా సూర్యనారాయణ తెలిపారు. బాలల హక్కుల పరిరక్షణలో నిర్లక్ష్యం వహించరాదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు ఉండవల్లి గాంధీ బాబు మరియు మండల గంగా సూర్యనారాయణ పేర్కొన్నారు. మంగళవారం అనకాపల్లి జిల్లా రెవిన్యూ డివిజనల్ కార్యాలయం సమావేశ మందిరంలో బాలల హక్కుల పరిరక్షణపై మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ, బాలల సంరక్షణ విభాగం, కార్మిక శాఖ, విద్యా శాఖ, పోలీసు శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, బీసీ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, సాంఘిక సంక్షేమ శాఖల అధికారులు, ట్రాన్స్ పోర్ట్ శాఖ, పంచాయతీ రాజ్ శాఖ మరియు డిఆర్‌డిఏ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు ఉండవల్లి గాంధీ బాబు, మండల గంగా సూర్యనారాయణ, మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ ఇ.శ్రీనివాసరావు, బాలల సంక్షేమ సమితి, ఛైర్పర్సన్ ఎమ్.ఆర్.ఎల్.రాధ, జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ మరియు సాధికారిత అధికారిని ఎన్.సూర్యలక్ష్మి, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఎమ్.రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణలో ప్రతి శాఖ అధికారి పూర్తి బాధ్యతతో పనిచేయాలని సూచించారు. బాల కార్మికుల నిర్మూలన, బాల్య వివాహాల నిరోధం, పోక్సో కేసుల దర్యాప్తు, బాధితుల పునరావాసం, బాలల అక్రమ రవాణా నివారణ, టీనేజ్ ప్రెగ్నెన్సీ, గంజాయి కేసులు, పాఠశాల మానేసిన పిల్లలను తిరిగి విద్యలో చేర్చడం వంటి అంశాలపై శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. పోక్సో కేసుల్లో నమోదైన ఎఫ్ఐఆర్‌లు, బాధిత పిల్లలకు అందించిన పరిహారం, పునరావాస చర్యలు, జనన ధ్రువీకరణ పత్రాల జారీ, వివిధ శాఖల సమన్వయంపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. కార్పొరేట్ మరియు ప్రైవేటు విద్యాసంస్థల్లో బాలల హక్కుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థులకు పరిశుభ్రమైన వసతి, సురక్షితమైన తాగు నీరు, పారిశుధ్యం, నాణ్యమైన ఆహారం, ఆరోగ్య సేవలు అందేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

బాలల హక్కుల పరిరక్షణలో ఏ శాఖ నిర్లక్ష్యం వహించినా ఉపేక్షించబోమని, జిల్లా స్థాయిలో గుర్తించిన సమ స్యలపై రాష్ట్ర ప్రభుత్వానికి సమగ్ర నివేదికతో పాటు తగిన సిఫారసులు సమర్పిస్తామని తెలిపారు. కమిషన్ సభ్యుడు ఉం డవల్లి గాంధీ బాబు మరియు ఎమ్.జి.సూర్యనారాయణ మాట్లా డుతూ జిల్లాలో జిల్లా స్థాయి అన్ని శాఖలతో సమీక్ష నిర్వహించి బాలల రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి బాలుడి సంక్షేమం, భద్రత రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యత అని పేర్కొన్నారు. జిల్లాలో గల స్వచ్ఛంద సంస్థల పరిధిలో గల బాలల సంరక్షణ కేంద్రాల అధికారులతో మధ్యాహ్నం 3 గంటలకు సమావేశం అయి పిల్లల బాగోగులు తెలుసుకోవడం జరిగింది. ఈ క్రమంలో కశింకోటలో గల బాలసధనాన్ని మరియు సుందరయ్య పేటలో గల దయ చైల్డ్ కేర్ హోమ్ అనే స్వచ్ఛంద సంస్థను కూడా కమిషన్ సందర్శించడం జరిగింది. సమావేశానంతరం బాల్య వివాహాల చట్టవిరుద్ధం పోస్టర్, దత్తత, 24 గంటల ఉచిత నెంబర్, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, టీనేజ్ ప్రెగ్నెన్సీ పోస్టర్స్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో మెడికల్ డిపార్ట్ మెంట్, విద్యా శాఖ, ఎస్సీ, ఎస్టీ బీసీ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ అధికారులు, కార్మిక శాఖ, డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ ఆఫీసర్ జ్యువినెల్ వెల్ఫేర్ డిపార్ట్ మెంట్, పంచాయతీ రాజ్ శాఖ మరియు సచివాలయ శాఖ, చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ అధికారులు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలి

**- ఓటరు జాబితా సవరణలో ఎటువంటి పొరపాట్లకు తావులేని విధంగా విజయవంతం చేయాలి : అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్**






**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ-2026 (సర్) ప్రక్రియను బిఎల్ఓలు క్రమశిక్షణతో పని చేయాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం చోడవరం మండలం మరియు బుచ్చయ్యపేట మండల తహశీల్దార్ కార్యాలయాల్లో ఈఆర్ఓ, ఏఈఆర్ఓలు, సూపర్వైజర్లు, బిఎల్ఓలతో జాయింట్ కలెక్టర్‌తో కలసి కలెక్టర్ విజయ క్రిష్ణన్ సమీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ మాట్లాడుతూ ఓటరు వివరాలను క్షుణ్ణంగా నమోదు చేయడంతో పాటు అర్హులైన ప్రతి ఓటరు వివరాలు జాబితాలో నమోదు అయ్యేలా జాగ్రత్తలు తీసుకోవాలని బియల్ఓలకు సూచించారు. సర్వే ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని బిఎల్ఓలను కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను శ్రద్ధ పెట్టి పనిచేయాలని, మ్యాపింగ్ ప్రక్రియ వేగంగా చేపట్టాలని బిఎల్ఓలను ఆదేశించారు. బిఎల్ఓలకు అదనంగా సహాయకులు ఏర్పాటుచేసి నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూపర్ వైజర్లను ఆదేశించారు.

# లోకం మాధవికి దరఖాస్తు సమర్పించిన గరికపాటి చంద్ర శేఖర్



**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** జనసేన పార్టీ నిర్మాణంలో భాగంగా జనసేన పార్టీ అధ్యక్షులు ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ జనసేన పార్టీ నిర్మాణ సారధుల సమాచార సేకరణ కమిటీకి తిరుపతి పార్లమెంట్ పరిశీలకురాలిగా ఎమ్మెల్యే లోకం మాధవిని నియమించారు.జనసేన నాయకుడు గరికపాటి చంద్రశేఖర్ ఎమ్మెల్యే లోకం మాధవికి పార్టీ నిర్మాణ సారధుల సమాచార సేకరణకు సంబంధించిన నియోజకవర్గం జనసేన ఇంచార్జి పదవిని తనకు ఇప్పించాలని దరఖాస్తు పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధిష్ఠానం తీసుకున్న నిర్ణయాలకు పూర్తిస్థాయిలో కట్టుబడి ఉంటానని, పార్టీ నిర్మాణం కోసం, పార్టీ బలోపేతం కోసం ఎల్లప్పుడూ ముందుండి సహకరిస్తానని తెలిపారు. జనసేన పార్టీ మరింత బలపడేలా ప్రతి జన సైనికుడు, వీర మహిళ, కార్యకర్త సమన్వయంతో పనిచేస్తానని తెలిపారు.

# గొల్లపల్లి ఎస్సీ కాలనీలో శ్రీ రామాలయ నిర్మాణానికి శ్రీకారం

**చేజర్ల, (రాజధాని వార్తలు):** చేజర్ల మండలం గొల్లపల్లి గ్రామం తూర్పు ఎస్సీ కాలనీలో శ్రీ కోదండ రామాలయ నిర్మాణానికి మంగళవారం హద్దులు ఏర్పాటు చేసి పనులకు శ్రీకారం చుట్టారు. రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి చేపట్టిన నూతన దేవాలయాల నిర్మాణ కార్యక్రమంలో భాగంగా ఈ ఏర్పాట్లు జరిగాయి. ఈ కార్యక్రమంలో 24 ఎల్ సోమశిల కాలువ అధ్యక్షుడు, తెలుగుదేశం పార్టీ నాయకుడు ఉడత హజరత్తయ్య కీలక పాత్ర పోషించారు. ఎన్నో సంవత్సరాలుగా ఆలయ నిర్మాణం కోసం ఎదురు చూస్తున్న కాలనీవాసుల ఆకాంక్ష నెరవేరే దిశగా చర్యలు ప్రారంభం కావడంతో వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో ఉడత హజరత్తయ్య చేస్తున్న కృషిని స్థానికులు అభినందించారు. ఆలయ నిర్మాణం పూర్తయితే కాలనీలో ఆధ్యాత్మిక వాతావరణం మరింత బలోపేతం అవుతుందని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేశారు.



# RAJADHANI CLASSIFIEDS Ad. Call 9440662699, rajadhanivartalu.com

## EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

## HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

## MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబంధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పాస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

## REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

## NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ బి.రమేష్, మంగళగిరి 0863-999999

## RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

## COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎక్ట్రానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి ప్రాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# కారుణ్య మరణాలకు ఏపీలో మార్గం సుగమం.. కొత్త మార్గదర్శకాలకు ప్రభుత్వ ఆమోదం



**అమరావతి, (రాజధాని వార్తలు):** చివరి దశలో ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగుల విషయంలో కీలక నిర్ణయం తీసుకునేందుకు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం మార్గం సుగమం చేసింది. మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆమోదం తెలిపిన తాజా మార్గదర్శకాలతో కారుణ్య మరణాలకు సంబంధించిన విధానానికి చట్టబద్ధమైన రూపం లభించింది. ఈ నిర్ణయం సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా తీసుకున్న చర్యగా ప్రభుత్వం పేర్కొంది. కొత్త మార్గదర్శకాల ప్రకారం, కోలుకునే అవకాశం లేని చివరి దశలో ఉన్న రోగుల విషయంలో నిర్దిష్ట నిబంధనలను అనుసరించి వైద్య బృందం, రోగి కుటుంబ సభ్యులు కలిసి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుంది. ఈ ప్రక్రియలో చట్టపరమైన నిబంధనలు, వైద్య నిపుణుల అభిప్రాయాలు, రోగి హక్కులు అన్నింటినీ పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటివరకు ఇలాంటి అంశాల్లో వైద్యులు, కుటుంబ సభ్యులు చట్టపరమైన సందిగ్ధ పరిస్థితులను ఎదుర్కొనేవారు. తాజా మార్గదర్శ కాలతో నిర్ణయ ప్రక్రియకు స్పష్టత రావడంతో పాటు, చట్టబద్ధమైన రక్షణ కూడా లభించనుంది. దీనివల్ల వైద్య సేవల నిర్వహణలో పారదర్శకత పెరగడంతో పాటు అవసరంలేని న్యాయపరమైన ఇబ్బందులు తగ్గే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ చికిత్సకు స్పందించే అవకాశాలు లేని రోగుల కుటుంబాలకు ఈ నిర్ణయం కొంత ఊరటనిచ్చే అవకాశముంది. అయితే ప్రతి కేసును నిర్దేశిత నిబంధనల ప్రకారం పరిశీలించి మాత్రమే తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాల అమలుతో ఆంధ్రప్రదేశ్‌లో కారుణ్య మరణాలపై స్పష్టమైన విధానం అమల్లోకి రానుంది.

# ఇండోనేషియా పర్యటనలో హిందీ పాట ప్రస్తావన..మోదీకి ధన్యవాదాలు చెప్పిన కరణ్ జోహార్



**ఇంటర్‌నెట్ డెస్క్:** భారత ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం ఇండోనేషియాలోని జకార్తాలో పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. ఇండోనేషియాలో ఓ భారతీయ సినిమాలోని పాటకు మంచి క్రేజ్ ఉందని అన్నారు. 'కుచ్ కుచ్ హోతా హై' సినిమాలోని 'కుచ్ కుచ్ హోతా హై' పాటను ప్రస్తావించారు. మోదీ మాట్లాడుతూ.. 'ఇక్కడ భారతదేశానికి చెందిన 'కుచ్ కుచ్ హోతా హై' పాట చాలా ప్రాచుర్యం పొందింది. భారతదేశం, ఇండోనేషియా కలిసి ముందుకు సాగినప్పుడు.. ఆ ప్రయాణం కేవలం 'కుచ్ కుచ్' (కొంచెం కొంచెం) దగ్గరే ఆగిపోకుండా 'బహుత్ కుచ్' (చాలా ఎక్కువ) సాధించడానికి దారి తీస్తుంది' అని అన్నారు.

**ధన్యవాదాలు చెప్పిన కరణ్ జోహార్..**

ఇండోనేషియా పర్యటనలో ప్రధాని నరేంద్ర మోదీ 'కుచ్ కుచ్ హోతా హై' పాటను ప్రస్తావించటంపై ప్రముఖ బాలీవుడ్ నిర్మాత, దర్శకుడు, నటుడు కరణ్ జోహార్ స్పందించారు. 'కుచ్ కుచ్ హోతా హై' సినిమాకు దర్శకత్వం వహించింది ఆయనే. ప్రధాని తన సినిమాలోని పాటను ప్రస్తావించటంపై కరణ్ సంతోషం వ్యక్తం చేశారు. 'జకార్తాలో మన గౌరవనీయ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'కుచ్ కుచ్ హోతా హై' సినిమా గురించి మాట్లాడటం చాలా సంతోషాన్ని, గర్వాన్ని కలిగించింది. అన్నింటికీ అతీతమైన ఒక భాష నిజంగానే ఉంది.. అదే ప్రేమ. ఈ పాటను ఆదరించి.. ఎప్పటికీ చరిత్రలో నిలిచిపోయేలా చేసినందుకు మీకు ధన్యవాదాలు' అని పేర్కొన్నారు.

# నంద్యాల జిల్లాలో రాజకీయ సెగలు.. అఖిలప్రియ వర్సెస్ బ్రిజేంద్రనాథ్ రెడ్డి

**నంద్యాల జిల్లా, (రాజధాని వార్తలు):** నంద్యాల జిల్లాలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది. అహోబిలం నుంచి ఆళ్లగడ్డకు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ బయలుదేరడంతో స్థానికంగా హైటెన్షన్ నెలకొంది. మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రనాథ్ రెడ్డి అలియాస్ నాని..అఖిలప్రియపై సంచలన ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన నివాసానికి అఖిల ప్రియ నేరుగా వెళ్లనున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. తాను చేసిన ఆరోపణలను నిరూపించేందుకు గంగుల నాని అహోబిలానికి రావాలని అఖిలప్రియ సవాల్ విసిరారు. అయితే నాని అక్కడకు వెళ్లలేదు. ఈ క్రమంలోనే అహోబిలం నుంచి ఆళ్లగడ్డకు అఖిలప్రియ బయలుదేరడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ పరిణామాలతో రెండు వర్గాల్లోని అనుచరులు పెద్ద సంఖ్యలో ఆళ్లగడ్డకు చేరే అవకాశం ఉండటంతో పోలీసులు ముందస్తు భద్రతా చర్యలు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా భారీ సంఖ్యలో పోలీసు బలగాలను మోహరించారు. గంగుల నాని నివాసం పరిసరాల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేసి,



పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. మరోవైపు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆళ్లగడ్డకు వస్తున్నారనే సమాచారం రావడంతో ఆమె అనుచరులు, గంగుల నాని వర్గీయులు అప్రమత్తమయ్యారు. దీంతో పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ట్రాఫిక్ నియంత్రణతో పాటు శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఈ రాజకీయ పరిణామాలపై స్థానిక ప్రజలు ఆసక్తిగా గమనిస్తున్నారు. అఖిలప్రియ, గంగుల నాని మధ్య నెలకొన్న ఈ తాజా పరిణామాలు నంద్యాల జిల్లా రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి.

# దేశవ్యాప్తంగా ఎన్ఐఏ భారీగా సోదాలు

**ఇంటర్‌నెట్ డెస్క్:** దేశ వ్యాప్తంగా ఎన్ఐఏ అధికారులు బుధవారం భారీగా సోదాలు చేపట్టారు. ఐసీస్, ఏక్యూఐఎస్ ఉగ్రవాద కార్యకలాపాల ప్రచారంపై సోదాలు చేశారు. భారత్‌లో హింసాత్మక జిహాద్ ద్వారా ఇస్లామిక్ స్టేట్ ఏర్పాటు కుట్రపై దర్యాప్తు ముమ్మరం చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు 10 రాష్ట్రాలు, ఢిల్లీ కేంద్రపాలిత ప్రాంతంలోని మొత్తం 20 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో పలు డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న పరికరాలను ఫోరెన్సిక్ పరీక్షలకు పంపనున్నట్లు ఎన్ఐఏ అధికారులు తెలిపారు. ఈ కేసులో ఇప్పటి వరకు 11 మంది నిందితులు, ఓ బాలుడిని జువెనైల్ నుంచి అదుపులోకి తీసుకున్నామని అధికారులు వెల్లడించారు. విజయవాడ పోలీసులు మార్చిలో నమోదు చేసిన కేసును మేలో ఎన్ఐఏకు బదిలీ చేసిన విషయం తెలిసిందే. ప్రధాన నిందితుడు రెహ్మతుల్లా షరీఫ్ మహ్మద్ నివాసంలో గతంలో ఐసీస్, ఏక్యూఐఎస్‌కు సంబంధించిన అభ్యంతరకర ప్రచార సామగ్రి లభ్యమైంది. గతంలో స్వాధీనం చేసుకున్న డిజిటల్ పరికరాల సాంకేతిక విశ్లేషణ ఆధారంగా ఎన్ఐఏ అధికారులు ఇవాళ సోదాలు నిర్వహించారు. అరెస్టైన నిందితులు దేశంలోని యువతను జిహాదీ భావజాలం వైపు మళ్లించే ప్రయత్నాలు చేసినట్లు అధికారుల దర్యాప్తులో వెల్లడైంది. విదేశీ హ్యాండ్లర్లతో ఆన్‌లైన్ ద్వారా సంబంధాలు కొనసాగిస్తూ ఉగ్ర భావజాలాన్ని వ్యాప్తి చేసినట్లు ఎన్ఐఏ అధికారులు గుర్తించారు. దేశాన్ని అస్థిరపరిచి 'ఖలీఫత్' స్థాపనకు కుట్ర పన్నిన వారిని గుర్తించే దిశగా దర్యాప్తు కొనసాగుతోందని ఎన్ఐఏ అధికారులు పేర్కొన్నారు.




Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan